SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక · తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక · తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

**7036644111, 9490140565**

సంపుటి: 19 | సంచిక: 283 | ఎడిటర్ : అలీ ముర్తుజా | బుధవారం 2 సెప్టెంబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |

# స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి



- బంగారాన్ని అనవసరంగా కొనకండి
- డెస్టినేషన్ పేరుతో విదేశాల్లో పెళ్లిళ్లు దూరం కండి
- దేశప్రజల సమిష్టి కృషితోనే జీడీపీ వృద్ధిరేటు
- దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించడం గర్వకారణం
- ఇన్‌స్టా వేదికగా ప్రధాని మోడీ దేశ ప్రజలకు అభినందనలు

4



## తదుపరి అమెరికా అధ్యక్షుడు ఎవరు?

- తెరపైకి రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేరు
- ఇప్పడే అలాంటి చర్చ అవసరం లేదన్న ట్రంప్

4

# కాంగ్రెస్‌లో చేరేందుకు ఎవరు ప్రయత్నించారు?

- కవిత దొంగచాటుగా కాంగ్రెస్‌లో ప్రవేశించే యత్నం చేయలేదా
- ఎవరి స్వలాభం కోసం ఆమె విమర్శలు చేస్తున్నారో తెలుసు
- కష్టకాలంలో మేము మాత్రమే కేసీఆర్‌ను వెన్నంటి ఉన్నాం
- కవిత వ్యాఖ్యలపై మండిపడ్డ వేముల

3





## కొత్తగూడెం విమానాశ్రయ ప్రతిపాదనపై సానుకూలత

- 7న కేంద్ర సాంకేతిక బృందం పర్యటన
- నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాల పరిశీలన
- సాంకేతిక నివేదిక అనంతరం తదుపరి చర్యలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రామ్మోహన్ నాయుడి హామీ

## జీడీపీ వృద్ధిరేటు గణాంకాల గారడీ

- ధరలు మోత మోగిస్తుంటే.. వృద్ధి ఎలా సాధ్యం
- ప్రధాని వ్యాఖ్యలపై మండిపడ్డ జైరామ్ రమేశ్



## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లపై స్టే ఎత్తివేత



తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట

సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధించిన హైకోర్టు

మిర్యాలగూడ బీఆర్ఎస్ రైతు ర్యాలీకి

## అనుమతి నిరాకరణ

- ట్రాఫిక్ సమస్యలు ఏర్పడే అవకాశం ఉందన్న పోలీసులు
- గ్రౌండ్ లేదా, హాలు లాంటి చోట్ల అయితే అభ్యంతరం లేదని వెల్లడి

3



సింగరేణి బొగ్గు గనుల్లో ప్రైవేటు సంస్థల ప్రవేశానికి రంగం సిద్ధమవుతోంది. భారీ నష్టాల్లో కొనసాగుతున్న భూగర్భ గనులను గని అభివృద్ధి, నిర్వహణ (ఎండీవో) విధానంలో ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రతిపాదనలను సింగరేణి పరిశీలిస్తోంది. కేంద్ర బొగ్గు శాఖ సూచనల మేరకు నష్టాలను తగ్గించుకునే మార్గాల్లో భాగంగా ఈ దిశగా అడుగులు వేస్తోంది.



# సింగరేణిలో 'ప్రైవేటు' అడుగులు!

- నష్టాల గనులను ఎండీవోకు ఇచ్చే యోచన
- తొలుత శాంతిఖనితో ప్రయోగానికి సన్నాహాలు
- 21 భూగర్భ గనుల్లో 1,924 కోట్లకు పైగా నష్టాలు
- ఆడ్రియాలలో టన్నుకు రూ.27 వేలకుపైగా నష్టం
- త్వరలో టెండర్లకు సింగరేణి కసరత్తు

**హైదరాబాద్, సెప్టెంబర్ 1:** సింగరేణి బొగ్గు గనుల్లో ప్రైవేటు సంస్థల ప్రవేశానికి రంగం సిద్ధమవుతోంది. భారీ నష్టాల్లో కొనసాగుతున్న భూగర్భ గనులను గని అభివృద్ధి, నిర్వహణ (ఎండీవో) విధానంలో ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రతిపాదనలను సింగరేణి పరిశీలిస్తోంది. కేంద్ర బొగ్గు శాఖ సూచనల మేరకు నష్టాలను తగ్గించుకునే మార్గాల్లో భాగంగా ఈ దిశగా అడుగులు వేస్తోంది. కోల్ ఇండియా, వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్స్ వంటి సంస్థల్లో ఎండీవో విధానాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో సింగరేణిలోనూ దీనిని ప్రయోగాత్మకంగా

మిగతా 2 లో

## ఢిల్లీకి చేరిన కొండా పంచాయితీ

- హైకమాండ్ నుంచి సురేఖకు పిలుపు..!
- కేసీ వేణుగోపాల్‌తో సురేఖ భేటీ చాన్స్!
- రాజకీయ ప్రకంపనలు రేపుతున్న పరిణామాలు



2

## ప్రళయం అంతులేని శోకం

ఇంకా వరదల్లో 275 మంది భారతీయులు

ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు



2

## అదనపు సంచాలకుడిగా డీఎస్ జగన్

సమాచార శాఖలో పదోన్నతి

బాధ్యతలు స్వీకరించిన జగన్

అభినందించిన మంత్రి పొంగులేటి

సమన్వయంతో పని చేయాలని సూచన

2



## కేసీ వేణుగోపాల్‌తో రేవంత్ భేటీ

- తాజా రాజకీయాలపై చర్చ

2



## ఎన్‌పీఎస్‌లో భారీ మార్పులు


2

అక్టోబర్ 1 నుంచి కొత్త నిబంధనలు

ఈక్విటీ ఆధారంగా ఐదు కేటగిరీలు

రిస్క్ స్థాయిని బట్టి పథకాల వర్గీకరణ

ప్రభుత్వ ఖాతాలకు మినహాయింపు





## కేసీ వేణుగోపాల్‌తో సీఎం భేటీ

**తాజా రాజకీయాలపై చర్చించినట్లు సమాచారం**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఇటీవలి రాజకీయ పరిమాణాలపై ఇరువురి మధ్య కీలక చర్చ జరిగినట్లు సమాచారం. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ అంశాలపై వీరిద్దరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. మంత్రి కొండా సురేఖ, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు, వారు ఇచ్చిన వివరణ తదితర అంశాలపై కేసీ వేణుగోపాల్‌తో రేవంత్ చర్చించినట్లు తెలుస్తోంది.

## ఎన్‌పీఎస్‌లో భారీ మార్పులు

**అక్టోబర్ 1 నుంచి కొత్త నిబంధనలు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** నేషనల్ పెన్షన్ సిస్టమ్‌లో కీలక మార్పులకు రంగం సిద్ధమైంది. ఎన్‌పీఎస్ పథకాల వర్గీకరణ, వాటి వివరాలను పెట్టుబడిదారులకు వెల్లడించే విధానంలో పెన్షన్ నియంత్రణ సంస్థ పీఎఫ్ఆర్‌డీఏ కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఆగస్టు 28న జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం ఈ మార్పులు అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. కొత్త విధానంలో ఎన్‌పీఎస్ పథకాలను వాటిలోని ఈక్విటీ పెట్టుబడి శాతం ఆధారంగా ఐదు కేటగిరీలుగా విభజించనున్నారు. తద్వారా పెట్టుబడిదారులు తమ రిస్క్ సామర్థ్యానికి అనుగుణంగా పథకాన్ని సులభంగా ఎంచుకునే అవకాశం కలుగుతుందని భావిస్తున్నారు. 80 నుంచి 100 శాతం వరకు ఈక్విటీ పెట్టుబడులు ఉండే పథకాలను 'కేటగిరీ–ఏ'గా వర్గీకరించి అత్యధిక రిస్క్‌తో కూడిన 'అగ్రెసివ్ గ్రోత్' పథకాలుగా చూపిస్తారు. 60 నుంచి 80 శాతం ఈక్విటీ ఉన్న పథకాలు 'కేటగిరీ––బీ'లోకి వస్తాయి. వీటిని అధిక రిస్క్ ఉన్న 'హై గ్రోత్' పథకాలుగా పేర్కొంటారు. 35 నుంచి 60 శాతం ఈక్విటీ ఉన్న పథకాలను 'కేటగిరీ–సీ'గా వర్గీకరించి 'బ్యాలెన్స్‌డ్ గ్రోత్' పథకాలుగా చూపిస్తారు. 10 నుంచి 35 శాతం ఈక్విటీ ఉన్నవి 'కేటగిరీ–డీ'లోకి వస్తాయి. వీటిని తక్కువ రిస్క్‌కు ప్రాధాన్యమిచ్చే 'కన్జర్వేటివ్' పథకాలుగా పరిగణిస్తారు. సున్నా నుంచి 10 శాతం వరకు ఈక్విటీ ఉన్న పథకాలు 'కేటగిరీ–ఈ'లో ఉండి ప్రధానంగా రుణ ఆధారిత పెట్టుబడులకు ప్రాధాన్యం ఇస్తాయి. ఒక పథకంలోని ఈక్విటీ పరిమితి రెండు కేటగిరీల్లోకి వచ్చేలా ఉండకూడదని కొత్త నిబంధనల్లో స్పష్టం చేశారు. ఎన్‌పీఎస్‌లో కొత్తగా చేరేవారికి మరో మార్పు అమల్లోకి రానుంది. అక్టోబర్ 1 నుంచి 'పాయింట్ ఆఫ్ ప్రజెన్స్' ద్వారా కొత్తగా ఎన్‌పీఎస్ ఖాతా తెరిచేవారి ఒక్కో పీఆర్ఏఎన్‌పై రూ.200 ఒకేసారి చెల్లించాల్సిన ఛార్జీ విధించనున్నారు. అయితే ఈ మొత్తాన్ని ఒకేసారి కాకుండా నాలుగు త్రైమాసికాల్లో రూ.50 చొప్పున సంబంధిత యూనిట్లను రద్దు చేయడం ద్వారా వసూలు చేయనున్నారు. పెట్టుబడిదారులు పథకాన్ని ఎంచుకునే ముందు స్పష్టమైన సమాచారం పొందేలా కొత్త విధానాన్ని రూపొందించారు. ఇకపై పథకం పేరు, పెన్షన్ ఫండ్, ప్రారంభ తేదీ, గత రాబడులు, బెంచ్‌మార్క్, ఛార్జీలు, రిస్క్‌మీటర్, నిర్వహణలో ఉన్న ఆస్తుల వివరాలను ఒకే విధానంలో ప్రదర్శించనున్నారు. దీంతో వివిధ పథకాల మధ్య తేడాలను సులభంగా అర్థం చేసుకోవడంతో పాటు రిస్క్, రాబడులను పోల్చుకుని నిర్ణయం తీసుకునేందుకు చందాదారులకు అవకాశం లభించనుంది. అయితే కొత్త వర్గీకరణ ప్రభుత్వ రంగ ఎన్‌పీఎస్ ఖాతాలకు వర్తించదు.

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లపై స్టేఎత్తివేత

**సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధించిన హైకోర్టు**

**హైదరాబాద్, సెప్టెంబర్1:** కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. పథకాల అమలుపై సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను సీజే ధర్మాసనం రద్దు చేసింది. పథకాలపై స్టే విధించడాన్ని సవాల్‌చేస్తూ ప్రభుత్వం దాఖలుచేసిన అప్పీలుపై హైకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. ఈ పథకాల నిమిత్తం ప్రభుత్వం 2014 నుంచి జారీ చేసిన 8 జీవోలను సవాల్‌చేస్తూ న్యాయవాది విజయ్‌గోపాల్ వ్యక్తిగత హోదాలో దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంతో పథకాల అమలును నిలిపివేస్తూ సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ 2014 నుంచి అమలవుతున్న సంక్షేమ పథకాలపై పిటిషన్ దాఖలైందన్నారు. ఈ పథకాల అమలు.. పిటిషనర్‌పై ఎలాంటి ప్రభావం చూపడంలేదని, అతని హక్కులకూ భంగం వాటిల్లలేదని, అంతేకాకుండా పథకం లబ్దిదారు కూడా కాదన్నారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని పేర్కొన్నారు. షాదీ ముబారక్ లాంటి పథకాన్ని సుప్రీంకోర్టు అనుమతించిందని, అలాంటిదే కల్యాణలక్ష్మి పథకమన్నారు. ఈ పిటిషన్ సింగిల్ జడ్జి వద్ద విచారణార్హం కాదని, ప్రభుత్వ విధాన నిర్ణయాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించే పరిధి ఈ డివిజన్ బెంచ్‌కు ఉందన్నారు. పథకం అమలుపై ఉన్న మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరారు. ఏజీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. స్టేను ఎత్తివేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

## హైడ్రా రంగనాథ్‌కు హైకోర్టులో ఊరట

**సింగిల్ జడ్జ్ ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 1:** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హై కోర్టులో ఊరట లభించింది. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కేసులో ఆయనపై సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆర్డర్‌ను డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది. తదుపరి విచారణ నవంబర్ 3వ తేదీకి న్యాయస్థానం వాయిదా వేసింది. అప్పటి వరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ని మార్చాలనే సింగిల్ బెంచ్ ఆర్డర్‌ను తాత్కాలికంగా డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది. తదుపరి ఆదేశాల వరకు లోతుకుంటా భూముల జోలికి వెళ్లవద్దని హై కోర్టు స్పష్టం చేసింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ తరపున హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు మాజీ సీజే జస్టిస్ రాజీవ్ శక్దర్ వాదనలు వినిపించారు. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కేసుపై అప్పీల్‌కు హైడ్రా కమిషనర్ వెళ్లిన విషయం తెలిసిందే. ఇదే కేసులో రంగనాథ్‌ని తప్పించి మరో అధికారిని నియమించాలని సింగిల్ జడ్జి గతంలో తీర్పునిచ్చారు. ఈ క్రమంలోనే సింగిల్ జడ్జి తీర్పుని హైడ్రా కమిషనర్ రంగనాథ్ డివిజన్ బెంచ్‌లో సవాల్ చేశారు.

# సింగరేణిలో 'ప్రైవేటు' అడుగులు!

మొదటి పేజీ తరువాయి

చేపట్టాలని భావిస్తున్నారు. తొలుత మందమర్రి ప్రాంతంలోని శాంతిఖని భూగర్భ గనిని ఈ విధానంలో అప్పగించేందుకు ప్రైవేటు సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తీకరణలను ఆహ్వానించగా ఒక సంస్థ ముందుకొచ్చినట్లు సమాచారం. దీంతో త్వరలో టెండర్లు పిలిచేందుకు సింగరేణి కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎండీవో విధానంలో గనిని ప్రైవేటు సంస్థకు అప్పగిస్తే.. సదరు సంస్థ తన సొంత ఖర్చుతో బొగ్గును వెలికితీసి ముందుగా నిర్ణయించిన ధరకు సింగరేణికి అందిస్తుంది. అనంతరం ఆ బొగ్గును సింగరేణి మార్కెట్‌లో విక్రయిస్తుంది. ప్రస్తుతం శాంతిఖని భూగర్భ గనిలో టన్ను బొగ్గు ఉత్పత్తికి రూ.21,558 వరకు వ్యయం అవుతుండగా.. విక్రయ ధర రూ.4,167 మాత్రమే ఉన్నట్లు సంస్థ లెక్కలు చెబుతున్నాయి. అంటే టన్నుకు రూ.17 వేలకుపైగా వ్యత్యాసం ఉంటోంది. ఎండీవో విధానంతో ఈ భారాన్ని తగ్గించుకోవచ్చని యాజమాన్యం భావిస్తోంది. సింగరేణి ఆర్థిక పరిస్థితిపై భూగర్భ గనుల్లో పెరుగుతున్న ఉత్పత్తి వ్యయం తీవ్ర ప్రభావం చూపుతోంది. ఉద్యోగుల వేతనాలు, స్థిర, చర వ్యయాలను కలిపితే టన్ను బొగ్గు ఉత్పత్తికి అయ్యే ఖర్చుకు.. మార్కెట్‌లో దాని విక్రయ ధరకు భారీ వ్యత్యాసం ఉంటోంది. 2025 చివరి నాటికి సంస్థకు ఉన్న 22 భూగర్భ గనుల్లో 21 నష్టాల్లో ఉన్నట్లు కేంద్రానికి సమర్పించిన నివేదికలో సింగరేణి పేర్కొంది. ఈ గనుల ద్వారా రూ.1,924 కోట్లకు పైగా నష్టాలు వచ్చినట్లు వెల్లడించింది. అడ్రియాల భూగర్భ గనిలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.



అక్కడ టన్ను బొగ్గు ఉత్పత్తికి రూ.30,333 వరకు వ్యయం అవుతుండగా.. విక్రయ ధర రూ.2,492 మాత్రమే ఉన్నట్లు సంస్థ పేర్కొంది. దీంతో టన్నుకు రూ.27,841 మేర నష్టం వస్తోంది. ఈ ఒక్క గనిలోనే గతేడాది రూ.302.87 కోట్ల నష్టం నమోదైనట్లు తెలిపింది. సింగరేణి ప్రస్తుతం 21 భూగర్భ, 17 ఓపెన్‌కాస్ట్ గనులను నిర్వహిస్తోంది. ఓపెన్‌కాస్ట్ గనుల్లో భారీ యంత్రాలతో పెద్దఎత్తున బొగ్గు వెలికితీసే అవకాశం ఉండటంతో ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉంటోంది. దీంతో వాటి ద్వారా వచ్చే లాభాలతో భూగర్భ గనుల నష్టాలను కొంతవరకు పూడ్చుకుంటున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. అయితే నష్టాల్లో ఉన్న గనుల నిర్వహణను ఎండీవో విధానంలో ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రతిపాదన ఇప్పుడు కీలకంగా మారింది. శాంతిఖనితో మొదలయ్యే ఈ ప్రయోగం విజయవంతమైతే మరిన్ని భూగర్భ గనులకూ ఇదే విధానాన్ని విస్తరిస్తారా? అన్నది సింగరేణి కార్మికవర్గాల్లో ఆసక్తికర చర్చగా మారనుంది.

# ఢిల్లీకి చేరిన కొండా పంచాయితీ



- హైకమాండ్ నుంచి సురేఖకు పిలుపు..!
- కేసీ వేణుగోపాల్‌తో సురేఖ భేటీ చాన్స్!
- రాజకీయ ప్రకంపనలు రేపుతున్నపరిణామాలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మరోసారి రాజకీయ ఉత్కంఠ తీవ్ర స్థాయికి చేరుకుంది. మంత్రి కొండా సురేఖ కు.. ఢిల్లీ హైకమాండ్ నుంచి పిలుపు రావడం, ఆమె హస్తినకు బయల్దేరడం ఇప్పుడు పార్టీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి వచ్చిన పిలుపు నేపథ్యంలోనే ఆమె హస్తినకు వెళ్లినట్లు సమాచారం. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో కొండా సురేఖ భేటీ కానున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అపాయింట్‌మెంట్ కోసం కూడా కొండా సురేఖ ప్రయత్నించినట్లు సమాచారం. దీంతో కొండా సురేఖ విషయంలో హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోందనే చర్చ జోరందుకుంది. గత కొంతకాలంగా మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె కొండా సుస్మితలకు సంబంధించిన వ్యవహారం తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టించిన విషయం తెలిసిందే. ఇటీవలే గీసుకొండలో సీఎం రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారితీశాయి. ఈ వ్యాఖ్యలపై పార్టీ నేతల్లో అసంతృప్తి వ్యక్తం కావడంతో పాటు.. పార్టీ క్రమశిక్షణ కమిటీ కూడా స్పందించింది. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలంటూ కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అయితే తన కుమార్తె వ్యాఖ్యలకు, తనకు ఎలాంటి సంబంధం లేదని.. అవి ఆమె వ్యక్తిగత వ్యాఖ్యలు అంటూ.. మంత్రి కొండా సురేఖ.. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవికి తన వివరణ అందించారు. ఆ తర్వాత కొండా సురేఖతో పాటు వనపర్తి వ్యవహారానికి సంబంధించి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన నివేదికను టీపీసీసీ అధిష్ఠానానికి పంపినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల మధ్య ప్రస్తుతం కొండా సురేఖ ఢిల్లీ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. హైకమాండ్ పెద్దలతో జరిగే సమావేశంలో తనపై వచ్చిన ఆరోపణలు, కుమార్తె వ్యాఖ్యల వ్యవహారం, పార్టీ అంతర్గత పరిణామాలపై కొండా సురేఖ వివరణ ఇచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. అయితే ఆమెపై ఎలాంటి చర్య తీసుకుంటారనే అంశంపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. కొండా సురేఖ ఢిల్లీ పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ వర్గాల్లో ప్రధానంగా రెండు రకాల చర్చలు వినిపిస్తున్నాయి. పార్టీ అధిష్ఠానం ఆమెకు కేవలం వివరణ కోరడంతో వ్యవహారాన్ని ముగిస్తుందా లేకపోతే.. పార్టీ క్రమశిక్షణకు సంబంధించిన అంశంగా పరిగణించి ఏదైనా చర్య తీసుకుంటుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకవేళ హైకమాండ్ నుంచి కఠిన నిర్ణయం వచ్చే పరిస్థితి ఉంటే మంత్రి పదవికి సురేఖ రాజీనామా చేసే అవకాశముందనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. మరోవైపు.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. సీఎం రేవంత్ ఢిల్లీకి వెళ్లిన కొద్దిసేపటికే మంత్రి కొండా సురేఖ కూడా హస్తినకు చేరుకోవడంతో కాంగ్రెస్ అంతర్గత వ్యవహారాలపై చర్చలు జరుగుతున్నాయనే ప్రచారం ఊపందుకుంది. అయితే కేబినెట్‌లో ఖాళీగా ఉన్న స్థానాల భర్తీ అంశం కూడా ఈ ఢిల్లీ పర్యటనలతో మరోసారి తెరపైకి వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో పార్టీ పెద్దలను కలుస్తుండటంతో కేబినెట్ విస్తరణపై కూడా నిర్ణయం తీసుకునే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. కొత్త మంత్రుల ఎంపిక, ఖాళీ స్థానాల భర్తీ, పార్టీకి సంబంధించిన ఇతర అంశాలపై హైకమాండ్‌తో చర్చలు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అదే సమయంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూడా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ కావడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

# ప్రళయం అంతులేని శోకం

**ఇంకా వరదల్లో 275 మంది భారతీయులు**

**ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 1:** నేపాల్–టిబెట్ సరిహద్దుల్లో చెలరేగిన వినాశకర ప్రళయం అంతులేని శోకాన్ని మిగుల్చింది. ఈ ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య వెయ్యి దాటగా.. 4,471 మంది ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. గల్లంతైన వారిలో కైలాస మానససరోవర యాత్రకు వెళ్లిన 275 మంది భారత పౌరులతో పాటు మరొక 128 మంది భారత సంతతి వ్యక్తులు ఉన్నారని విదేశాంగ శాఖ వెల్లడించింది. రోజురోజుకూ నదుల్లో మృతదేహాలు కొట్టుకొస్తుండటంతో నేపాల్ శవాగారాలన్నీ నిండిపోయి, మృతదేహాలను భద్రపరచడం, గుర్తించడం అధికారులకు అత్యంత సంక్లిష్టంగా మారింది. గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసేందుకు నేపాల్ ప్రభుత్వం బాధితుల వివరాలతో పవర్ పాయింట్ స్లైడ్‌షోలను కూడా సిద్ధం చేసింది. ఈ విపత్కర పరిస్థితిలో మృతుల కుటుంబాలకు సహాయం అందించేందుకు ఖాట్మాండులోని భారత రాయబార కార్యాలయం ప్రత్యేక మార్గదర్శకాలను విడుదల చేసింది. నేపాల్ ప్రభుత్వం వెబ్‌సైట్‌లో విడుదల చేస్తున్న ఫోటోలు, వివరాల ద్వారా మృతదేహాలను గుర్తించిన పక్షంలో.. భౌతికకాయాలను స్వదేశానికి తరలించేందుకు స్థానిక అధికారులతో సమన్వయం చేస్తామని ఎంబసీ తెలిపింది. దీనికోసం నేపాల్ ప్రభుత్వం రూపొందించిన 9 అంచెల నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. ముఖ్యంగా మృతదేహ అవశేషాల డాక్యుమెంటేషన్, లభ్యమైన ఫోటోలు, వివరాలను నమోదు చేయాలి. అలాగే పోస్టుమార్టం నిర్వహణ, మరణానికి గల కారణాల నిర్ధారణ, అధికారికంగా వ్యక్తి గుర్తింపు, వేలిముద్రలు, డీఎన్ఏ, ఫోరెన్సిక్ శాంపిళ్ల సేకరణ, మృతుడి పాస్‌పోర్ట్ లేదా ఐడీ వెరిఫికేషన్, ఎంబసీ లేదా కాన్సులర్ సమన్వయ ప్రక్రియ పూర్తి, హ్యాండోవర్ మెమో, రసీదుల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. మృతదేహాలు బాగా కుళ్లిపోయి, ఆకృతులు దెబ్బతినడంతో గుర్తింపు ప్రక్రియ కష్టసాధ్యంగా



మారింది. దీంతో నేపాల్ అధికారులు తాత్కాలిక పూడ్చివేతలను ప్రారంభించారు. ప్రతి శరీరానికి డీఎన్ఏ నమూనా తీసుకుని, ప్లాస్టిక్ బ్యాగ్‌లో ఉంచి ట్యాగ్, లోకేషన్ నంబర్‌ను కేటాయించి పూడ్చి పెడుతున్నారు. భవిష్యత్తులో డీఎన్ఏ మ్యాచ్ అయినప్పుడు కుటుంబ సభ్యులకు భౌతికకాయాల అవశేషాలను అప్పగించి తుది సంస్కారాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు.

# అదనపు సంచాలకుడిగా డీఎస్ జగన్

**సమాచార శాఖలో పదోన్నతి**

**బాధ్యతలు స్వీకరించిన జగన్**

**అభినందించిన మంత్రి పొంగులేటి**

**సమన్వయంతో పనిచేయాలని సూచన**

హైదరాబాద్, సెప్టెంబర్ 1: సమాచార, పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకుడిగా డీఎస్ జగన్ పదోన్నతి పొందారు. ఆయనకు పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో అదనపు సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సచివాలయంలో సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని జగన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగన్‌కు మంత్రి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేయాలని సూచించారు. ప్రభుత్వం, ప్రజలు, మీడియా మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ డా. జి. ముకుందరెడ్డిని జగన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన కూడా జగన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. తనపై ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా విధులను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల సమాచారాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు శాఖ అధికారులు, సిబ్బందితో సమన్వయంతో పనిచేస్తానని తెలిపారు. అదనపు సంచాలకుడిగా బాధ్యతలు చేపట్టిన జగన్‌కు శాఖ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.



# కాంగ్రెస్‌లో చేరేందుకు ఎవరు ప్రయత్నించారు?

- కవిత దొంగచాటుగా కాంగ్రెస్‌లో ప్రవేశించే యత్నం చేయలేదా
- ఎవరి స్వలాభం కోసం ఆమె విమర్శలు చేస్తున్నారో తెలుసు
- కష్టకాలంలో మేము మాత్రమే కేసీఆర్‌ను వెన్నంటి ఉన్నాం
- కవిత వ్యాఖ్యలపై మండిపడ్డ మాజీ మంత్రి వేముల



**నిజామాబాద్, సెప్టెంబర్ 1:** కాంగ్రెస్‌లో చేరేందుకు పలువురిని కలిసి రాయబేరాలు నడిపిన కవిత తనను విమర్శించడం విడ్డూరంగా ఉందని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కేసీఆర్‌కు నమ్మకబంట్లుగా ఉన్న వారిని విడదీసి పార్టీని బలహీన పర్చాలన్న ఎజెండాతో కవిత పనిచేస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై, ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. కవితను కేసీఆర్‌ను కలపడానికి ప్రయత్నం చేసిన, విడగొట్టడానికి ప్రయత్నం చేసిన విషయం కేసీఆర్‌కు బాగా తెలుసు. పార్టీ లైన్ దాటిన తర్వాత కేసీఆర్ కవితను పార్టీ నుంచి వేటు వేశారని అన్నారు. నేను, మా తండ్రి వేముల సురేందర్‌రెడ్డి టీఆర్ఎస్ పార్టీకి వ్యవస్థాపక సభ్యులం. 2001 తెలంగాణ ఆవిర్భావానికి ముందే టీఆర్ఎస్ పార్టీలో ఉన్నాం. టీఆర్ఎస్ అంటేనే ప్రశాంత్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి అంటేనే టీఆర్ఎస్ పార్టీ. కవిత మధ్యలో వచ్చిండ్రు.. మధ్యలో పోయిండ్రని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీతో నేను మంతనాలు చేశానని అంటున్న కవిత.. ఇప్పుడు కష్టకాలంలో కేసీఆర్ వెంట ఉన్నది నేనా.. కవితనా? అసెంబ్లీలో, అసెంబ్లీ బయట, జిల్లాలో రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నది నేనా.. కవితనా? అని ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. లక్ష్మీనరసింహస్వామి సన్నిధానంలో ఉన్న నేను కాంగ్రెస్‌లోని ఎవరితో మంతనాలు చేయలేదు. కవిత కాంగ్రెస్‌తో మంతనాలు చేయలేదని చెప్పగలరా? కవిత రహస్యంగా కాంగ్రెస్ నాయకులతో మంతనాలు చేయలేదని చెప్పగలరా? అని ప్రశ్నించారు. నిరాధారమైన ఆరోపణలు ఎవరి లాభం కోసం కవిత చేస్తున్నారు? స్వలాభం కోసం వ్యక్తిగత ప్రతిష్టలు దెబ్బతీసే విధంగా మాట్లాడడం కరెక్ట్ కాదు. నాపై నిరాధారమైన ఆరోపణలు చేసే హక్కు కవితకు లేదని అన్నారు. మొదటి నుంచి టీఆర్ఎస్ పార్టీకి వ్యవస్థాపక సభ్యులుగా ఉన్న వారిని కవిత టార్గెట్ చేస్తున్నారు. కేసీఆర్‌కు దగ్గరగా ఉన్న వారిని కవిత టార్గెట్ చేస్తుంది. ప్రత్యక్షంగా మా నాయకత్వాన్ని బలహీనపరిచి, పరోక్షంగా అధికార పార్టీకి కవిత న్యాయం చేస్తుందని ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. కవిత సభలో కన్నీళ్లు పెట్టుకోవడంపై స్పందిస్తూ.. రాజకీయంగా సింపతిని గెయిన్ చేయడానికి అని అర్థం అవుతుంది. అది ఆమె విజ్ఞతకు వదిలేస్తున్నాం. కవిత చేసే ఈ పనుల వల్ల కేసీఆర్ ఎంత మనోవేదనకు గురవుతున్నారో బిడ్డగా ఆమె ఆలోచించడం లేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్. ఆయనపైన, కేటీఆర్‌పైన విమర్శలు చేయగా లేనిది మాపై చేయడం పెద్ద ఆశ్చర్యాన్ని కలిగించలేదు. కానీ బాధగా అనిపించింది. సొంత లాభం కోసం కవిత మాట్లాడటం పెద్ద బాధగా అనిపించలేదని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కవితను రెండుసార్లు ఎమ్మెల్సీగా చేయడంలో నా పాత్ర ఏందో కేసీఆర్‌కు బాగా తెలుసు. కవితపై మొన్నటి వరకు కేసీఆర్ బిడ్డగా గౌరవం ఉండేది. నిన్నటి మాటలతో ఆ గౌరవాన్ని కవిత పోగొట్టుకుందని వ్యాఖ్యానించారు. ఇకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో లింబాద్రి గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రయోజనాలను సూచించే 'బాకీ కార్డులకు' ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆ హామీలను అమలు చేస్తామని చెప్పిందని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. 1000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీల్లో అనేక హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీల ద్వారా ఎంత మేర బాకీ పడిందో ప్రజలకు తెలియజేస్తూ, ఇచ్చిన హామీలను ఇకనైనా నెరవేర్చాలని కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేసేందుకు బీఆర్ఎస్ చేపట్టిన 'బాకీ కార్డుల పూజ' కార్యక్రమంలో రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు తదితర వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజల ముందుంచారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కొత్తగూడెం విమానాశ్రయ ప్రతిపాదనపై సానుకూలత

- 7న కేంద్ర సాంకేతిక బృందం పర్యటన
- నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాల పరిశీలన
- సాంకేతిక నివేదిక అనంతరం తదుపరి చర్యలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రామ్మోహన్ నాయుడి హామీ




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1 :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు ప్రతిపాదనకు సంబంధించి నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాలను పరిశీలించేందుకు కేంద్ర సాంకేతిక బృందం సెప్టెంబర్ 7న తెలంగాణలో పర్యటించనుంది. న్యూఢిల్లీలో మంగళవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో సమావేశమైన అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. గతంలో పరిశీలించిన రెండు స్థలాలు సాంకేతిక కారణాలతో విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా లేవని తేలడంతో, తాజాగా నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించినట్లు మంత్రి తెలిపారు. ఈ స్థలాల్లోని భౌగోళిక, వాతావరణ పరిస్థితులతోపాటు విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన సాంకేతిక సాధ్యాసాధ్యాలను కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుందని చెప్పారు. ÷ంద్ర సాంకేతిక బృందం నివేదిక అనుకూలంగా వచ్చిన అనంతరం కొత్తగూడెం విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన తదుపరి చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపడుతుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. తెలంగాణలోని మామునూరు (వరంగల్), ఆదిలాబాద్ విమానాశ్రయాల ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెప్టెంబర్ 2న కేంద్ర ప్రభుత్వంతో చర్చించే అవకాశం ఉందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తండ్రి, దివంగత ఎర్రన్నాయుడు తన చిరకాల మిత్రుడని మంత్రి తుమ్మల గుర్తుచేసుకున్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఉన్న ఈ ప్రాంత ప్రాధాన్యాన్ని, జిల్లా ప్రజలకు విమానాశ్రయం అవసరాన్ని కేంద్ర మంత్రికి వివరించినట్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల దీర్ఘకాల ఆకాంక్షను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లాను. నా విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి, వెంటనే కేంద్ర సాంకేతిక బృందాన్ని పంపేందుకు చర్యలు చేపట్టిన కేంద్ర మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడికి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు' అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# ఎంపీ ల్యాడ్స్ నిధులపై దుష్ప్రచారం తగదు

## ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదు

## ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ నివేదికపై బండి



**కరీంనగర్, సెప్టెంబర్ 1:** ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంపై దుష్ప్రచారాలు తగవని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ విడుదల చేసిన నివేదికపై బండి స్పందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా కేటాయిస్తున్న ఎంపీ ల్యాడ్స్ నిధులను వినియోగించు కోవడంలో పార్లమెంట్ సభ్యులు పూర్తిగా వెనుకబడ్డారన్న ఆ సంస్థ నివేదిక సత్యదూరమని బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఎంపీ ల్యాడ్స్ కింద పంపిన ప్రతిపాదనలకు సంబంధించి పనుల పురోగతి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదని పేర్కొన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంపీ ల్యాడ్స్ కింద రూ.17.50 కోట్లు కేటాయించగా.. అందులో ఇప్పటికే రూ.16.47 కోట్లు వినియోగించామని ఆయన స్పష్టం చేశారు. అందుకు సంబంధించిన వివరాలను గణాంకాలతో సహా బండి సంజయ్ మీడియాకు వివరించారు. 'కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి గత మూడేళ్లలో కమ్యూనిటీ హాళ్లు, బోర్‌వెల్స్, హైమాస్ట్ లైట్లు, సీసీ రోడ్ల నిర్మాణాల కోసం స్థానిక ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు 627 ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపాం. ఇందులో కరీంనగర్ జిల్లా నుంచి 313, హన్మకొండ నుంచి 39, జగిత్యాల నుంచి 45, రాజన్న సిరిసిల్ల నుంచి 151, సిద్దిపేట నుంచి 79 పనులకు సంబంధించిన ప్రతిపాదనలున్నాయి. వీటిలో 82.29 శాతం పనులకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఆమోదం తెలిపారు. మిగిలిన పనుల మంజూరు అంశం ప్రాసెస్‌లో ఉంది. మొత్తంగా కేంద్రం కేటాయించిన రూ.17.5 కోట్లలో 94.1 శాతం మేరకు అంటే రూ.16.47 కోట్ల నిధులకు సంబంధించిన పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని కేంద్ర మంత్రి వివరించారు. ఇందులో 16వ లోక్‌సభ సభ్యుడిగా కొనసాగిన బోయినపల్లి వినోద్ కుమార్ తన ఐదేళ్ల కాలంలో వినియోగించని రూ.2.5 కోట్లను సైతం తాను ఖర్చు చేసినట్లు బండి సంజయ్ తెలిపారు. వాస్తవానికి స్థానిక సమస్యల పరిష్కారానికి సంబంధించి కేంద్రం ఏటా కేటాయిస్తున్న ఎంపీ ల్యాడ్స్ నిధులు సరిపోవడం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా నిధులను ఏటా పెంచాలని కోరుతూ ఇప్పటికే ఎంపీల నుంచి కేంద్రానికి అనేక విజ్ఞప్తులు వెళున్నాయని తెలిపారు. అయినప్పటికీ ఎంపీ ల్యాడ్స్ నిధులే ఖర్చు చేయడం లేదంటూ ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ ప్రచారం చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఎంపీ ల్యాడ్స్ నిధుల కేటాయింపు, ఎంపీల ప్రతిపాదనలు, జిల్లా కలెక్టర్ల ఆమోదం, వివిధ శాఖల అధికారుల కార్యాచరణ, అమలు, పనుల పూర్తి వరకు అనేక దశలు ఉన్నాయని తెలిపారు. ఇవేవీ పట్టించుకోకుండా ఏకపక్షంగా పార్లమెంట్ సభ్యులు ఎంపీ ల్యాడ్స్ నిధులనే వినియోగించుకోవడం లేదని ఆరోపణ చేయడమంటే బట్ట కాల్చి మీద వేయడమేనని మండిపడ్డారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో 7 నెలల సమయం ఉన్నప్పటికీ తన వద్ద ఎంపీ ల్యాడ్స్ నిధులే మిగలలేదని, ఆ నిధులకు సంబంధించిన ప్రతిపాదనలన్నీ ఎప్పుడో సంబంధిత జిల్లాల కలెక్టర్లకు పంపామని వివరించారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం తన వద్దకు వచ్చే ప్రజల విజ్ఞప్తులను పరిష్కరించేందుకు అవసరమైన నిధుల కోసం సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ఫండ్స్‌ను కూడా సేకరిస్తున్నామనే విషయాన్ని ఆ సంస్థ గుర్తుంచుకోవాలన్నారు. ఇకనైనా ఎంపీ ల్యాడ్స్ నిధులకు సంబంధించి నగదు కేటాయింపు, ఎంపీల ప్రతిపాదనలు, జిల్లా కలెక్టర్ల ఆమోదం, వివిధ శాఖల అధికారుల కార్యాచరణ, అమలు, పనుల పూర్తి వరకు దశలవారీగా వాస్తవాలను ఆ సంస్థ పరిగణనలోకి తీసుకుని, వాటిని ప్రజల ముందు ఉంచాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కోరారు.



# మిర్యాలగూడ బీఆర్ఎస్ రైతుర్యాలీకి అనుమతి నిరాకరణ

## ట్రాఫిక్ సమస్యలు ఏర్పడే అవకాశం ఉందన్న పోలీసులు

## గ్రౌండ్ లేదా, హాలు లాంటి చోట్ల అయితే అభ్యంతరం లేదని వెల్లడి

**నల్లగొండ, సెప్టెంబర్ 1:** మిర్యాలగూడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన రైతు ర్యాలీ, బహిరంగ సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. శాంతిభద్రతలు, ట్రాఫిక్ సమస్యలను కారణంగా చూపుతూ కేటీఆర్ ర్యాలీ, మీటింగ్‌కు అనుమతి ఇవ్వలేమని తిరస్కరించారు. ఈనెల 3న మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి రాజీవ్ చౌక్ వరకు రైతు ర్యాలీ నిర్వహించడంతో పాటు రాజీవ్ చౌక్‌లో బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ర్యాలీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో ర్యాలీకి అనుమతి కోరుతూ బీఆర్ఎస్ మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు. వ్యవసాయ రంగం, సాగునీరు, విద్యుత్, యూరియా కొరత, రైతు భరోసా తదితర రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దరఖాస్తులో పేర్కొన్నారు. దీనిపై మిర్యాలగూడ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి అనుమతి నిరాకరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే రాజీవ్ చౌక్ ప్రధాన కూడలి కావడంతో భారీ సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు, రైతులు తరలివస్తే అన్ని వైపుల నుంచి ట్రాఫిక్ నిలిచిపోయే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు. రాజీవ్ చౌక్‌కు వచ్చే రహదారులు ఇరుకుగా ఉండటంతో పాటు ఈ ప్రాంతంలో రోజంతా భారీగా వాహనాల రాకపోకలు సాగుతుంటాయని తెలిపారు. అక్కడ ట్రాఫిక్‌ను మళ్లించేందుకు తగిన ప్రత్యామ్నాయ మార్గాలు కూడా లేవని, వాహనాల పార్కింగ్‌కు సరిపడా స్థలం అందుబాటులో లేదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రోడ్లపై వాహనాలను నిలిపితే ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని తెలిపారు. మరోవైపు కోదాడ-జడ్చర్లను కలిపే జాతీయ రహదారి-167 రాజీవ్ చౌక్ మీదుగా వెళ్తుందని పోలీసులు గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహిస్తే జాతీయ రహదారిపై కూడా రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాజీవ్ చౌక్ పరిసరాల్లో పలు ప్రభుత్వ, ఇతర ముఖ్య కార్యాలయాలు ఉన్నందున బహిరంగ సభ వల్ల వాటి సాధారణ కార్యకలాపాలకు ఇబ్బంది కలగవచ్చని పోలీసులు తెలిపారు. ర్యాలీ, సభకు అనుమతి ఇస్తే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని పేర్కొంటూ అనుమతిని తిరస్కరించారు. అయితే ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఇతర ప్రాంతాల్లో ఫంక్షన్ హాల్, గ్రౌండ్ వంటి ప్రదేశాల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన కార్యక్రమం నిర్వహించు కునేందుకు అవకాశం కల్పిస్తామని పోలీసులు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

# రాంచంద్రరావు హౌజ్ అరెస్ట్




**హైదరాబాద్,సెప్టెంబర్1 :** భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తార్నాకలోని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. భాజపా నల్గొండ జిల్లా అధ్యక్షుడి నివాసానికి వెళ్లనున్నట్టు ప్రకటించడంతో ఆయన్ను గృహనిర్బంధం చేసినట్టు పోలీసులు తెలిపారు. నల్గొండ జిల్లాలో భాజపా, కాంగ్రెస్ శ్రేణుల మధ్య పరస్పరం దాడులు జరిగాయి. నల్గొండలో మంత్రి కోమటి రెడ్డి కార్యాలయంపై భాజపా కార్యకర్తలు కోడిగుడ్ల దాడి చేయగా.. భాజపా నల్గొండ జిల్లా అధ్యక్షుడు వర్షిత్ రెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేశారు. దీంతో పట్టణంలో ఉద్రిక్తత ఏర్పడింది. ఈ క్రమంలో నల్లగొండ వెళ్లేందుకు రామచంద్రరావు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ ఘటనపై బిజెపి శ్రేణులు మండిపడ్డాయి. అలాగే కేంద్రమంత్రి బండి సంజయ్ కూడా పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఢిల్లీ మార్చ్‌ను ఉపసంహారణ

## ప్రభుత్వ హామీతో సీజేపీ నిర్ణయం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కీలక నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 5న ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీస్ హెడ్ క్వార్టర్స్ వరకు నిర్వహించ తలపెట్టిన నిరసన యాత్రను విరమించుకుంటున్నట్లు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సానుకూల హామీలు ఇచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీజేపీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ మంగళవారం సర్వోన్నత న్యాయస్థానానికి వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ, నీట్ వివాదం కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు మూడు నెలల కాలపరిమితిలోగా పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా, జులై 20 నుంచి 25 మధ్య కాలంలో నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను తదుపరి విచారణకు తీసుకెళ్లబోమని, కొత్త కేసులు నమోదు చేయబోమని స్పష్టం చేశారు. గతంలో సీజేపీకి ఇచ్చిన హామీలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన కోర్టుకు విన్నవించారు. ప్రభుత్వ హామీలపై సీజేపీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ స్పందిస్తూ, "కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సానుకూల హామీలకు, వాటికి లభించిన న్యాయపరమైన భరోసాకు అనుగుణంగా సెప్టెంబర్ 5న తలపెట్టిన మార్చ్‌ను ఉపసంహరించుకోవడమే సముచితమని భావిస్తున్నాం. న్యాయస్థానం జారీ చేసిన తాజా ఉత్తర్వులకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ఆశిస్తున్నాం" అని పేర్కొన్నారు. నీట్-యూజీ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో నిరసనకారులపై నమోదైన కేసులను ఎత్తివేస్తామని జులై 25న ఇచ్చిన హామీని కేంద్రం నిలబెట్టుకోలేదని ఆరోపిస్తూ సీజేపీ ఈ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. కాగా, సీజేపీ తాజాగా తీసుకున్న నిరసన రద్దు నిర్ణయాన్ని జస్టిస్ సూర్యకాంత్ 'మంచి పరిణామం'గా అభివర్ణిస్తూ ప్రశంసించారు.



# భారత్‌కు మరిన్ని ఎస్-400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థ

## రష్యాతో డీల్ కుదుర్చుకోనున్న భారత్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** 'ఆపరేషన్ సిందూర్'లో సమర్థవంతంగా పనిచేసిన రష్యన్ ఎస్-400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థలకు భారత్ మరోసారి కొనుగోలు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. వీటి అవసరాలు పెంచుకోవాలని భారత రక్షణశాఖ నిర్ణయించినట్లు సమాచారం. భారత వైమానిక దళం కోసం మరో ఐదు ఎస్-400 వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు జారీచేసిన టెండర్‌కు రష్యా స్పందించినట్లు సమాచారం. ఈ మేరకు 5 కొత్త వ్యవస్థలను భారత్‌కు విక్రయించేందుకు రష్యా అంగీకరించి నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. భారత సైనిక వ్యవస్థలో 'సుదర్శన్'గా పిలుస్తున్న ఎస్-400.. గతేడాది ఆపరేషన్ సిందూర్‌లో అదరగొట్టింది. శత్రువుల వైపు నుంచి వచ్చిన ప్రమాదాలను విజయవంతంగా అడ్డుకోవడంలో ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసిందని భారత రక్షణ వర్గాలు తెలిపాయి. ఎస్-400 పనితీరుకు సంబంధించి పశ్చిమ వైమానిక కమాండ్ అధిపతి ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా గతంలో ఓ పోడ్‌కాస్ట్‌లో కీలక విషయాలు వెల్లడించారు. పాకిస్థాన్ వైమానిక దళానికి చెందిన నిఘా విమానాన్ని 314 కి.మీ. దూరంలో ఎస్-400 కూల్చివేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంత దూరంలో భూమి నుంచి ప్రయోగించిన గగనతల రక్షణ క్షిపణి లక్ష్యాన్ని ఛేదించడం అత్యంత అరుదని నాడు రక్షణ రంగంలో చర్చ కూడా జరిగింది. ఎస్-400 అనేది ఒకే మిసైల్ కాదు. ఇందులో అత్యాధునిక రాడార్లు, కమాండ్ వ్యవస్థలు, వివిధ రకాల క్షిపణులు వంటి అనేక భాగాలుంటాయి. వీటిలోని కొన్ని క్షిపణులకు 400 కి.మీ. వరకు లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం ఉంటుంది. దీంతో శత్రు విమానాలు భారత గగనతలానికి చేరకముందే వాటిని గుర్తించి ఎదుర్కోగలవు. ఈ కారణంగానే భారత్ తన బహుళస్థాయి వైమానిక రక్షణ వ్యవస్థలో ఎస్-400కు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. 2018లో కుదిరిన తొలి ఒప్పందం ప్రకారం.. భారత్ మొత్తం 5 ఎస్-400 యూనిట్లను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందులో ఇప్పటివరకు 4 యూనిట్లు భారత్‌కు అందాయి. ఇంకో యూనిట్ నవంబర్ నాటికి అందే అవకాశముంది. తాజాగా మరో 5 యూనిట్ల కోసం భారత్ ఆసక్తి చూపుతోందని సమాచారం.

# సికింద్రాబాద్ మద్రాస్ రెజిమెంట్‌లో ఆయుధాల చోరీ

## కట్టుదిట్టమైన భద్రత ఉన్నా రైఫిళ్లు మాయమైనట్లు సమాచారం

## దర్యాప్తునకు రంగంలోకి దిగిన బొల్లారం పోలీసులు

**హైదరాబాద్,సెప్టెంబర్ 1:** సికింద్రాబాద్‌లోని మద్రాస్ రెజిమెంట్ ప్రాంతంలో అత్యాధునిక ఆయుధాలు మాయమవడం తీవ్ర ఆందోళనకు దారితీసింది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే ఆర్మీ కాంపౌండ్‌లోకి చొరబడిన దుండగులు ఆయుధాలు భద్రపరిచే గదికి సంబంధించిన తాళాన్ని పగలగొట్టి 12 ఆయుధాలను అపహరించినట్లు సమాచారం. ఈ ఘటనపై ఆర్మీ అధికారులు బొల్లారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. చోరీకి గురైన ఆయుధాల్లో నాలుగు ఏకే-47 రైఫిళ్లు, ఒక ఇన్సాస్ రైఫిల్, ఆరు పిస్టళ్లు ఉన్నాయి. వీటితో పాటు పెద్ద మొత్తంలో మందుగుండు సామగ్రి కూడా మాయమైనట్లు అధికారులు అనుమానిస్తున్నారు. అయితే రక్షణ వ్యవహారాలకు సంబంధించిన సున్నితమైన అంశం కావడంతో పోలీసులు ఆయుధాల చోరీకి సంబంధించిన పూర్తి వివరాలను గోప్యంగా ఉంచుతున్నారు. మద్రాస్ రెజిమెంట్ ప్రాంతం చుట్టూ ఎత్తైన ప్రహరీతో పాటు మూడంచెల భద్రతా వ్యవస్థ కొనసాగుతోంది. రెజిమెంట్ ప్రాంతంలోకి వెళ్లాలన్నా, బయటకు రావాలన్నా అనుమతి తప్పనిసరి. ఆయుధాలు, మందుగుండు సామగ్రి భద్రపరిచే స్టోర్స్ చుట్టూ ప్రత్యేక భద్రత ఉంటుంది. అంతేకాకుండా అత్యాధునిక సీసీ కెమెరాలతో నిత్యం నిఘా కొనసాగుతుంది. ఇంతటి కట్టుదిట్టమైన భద్రత ఉన్న ప్రాంతంలోకి దుండగులు ఎలా ప్రవేశించారు.? ఆయుధాలు భద్రపరిచిన గది వరకు ఎలా చేరుకున్నారు.? తాళాన్ని ఎలా పగలగొట్టారు.? అనే అంశాలపై పోలీసులు దృష్టి సారించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు రెజిమెంట్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. రెజిమెంట్‌లోకి ఇటీవల ఎవరెవరు వచ్చారు.? ఎవరు బయటకు వెళ్లారు.? అనుమతులు ఎవరికి ఉన్నాయి.? అనే వివరాలను సేకరిస్తున్నారు. అలాగే అనుమానితులను కూడా పోలీసులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఆయుధాల స్టోర్స్‌లో పనిచేసే సిబ్బంది, భద్రతా విధుల్లో ఉన్న సిబ్బంది వివరాలను కూడా క్షుణంగా పరిశీలిస్తున్నారు. చోరీకి గురైన ఆయుధాలు, మందుగుండు సామగ్రి పరిమాణం దృష్ట్యా ఈ ఘటనలో ఒకరి కంటే ఎక్కువ మంది వ్యక్తులు పాల్గొని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. నాలుగు ఏకే-47 రైఫిళ్లు, ఇన్సాస్ రైఫిల్, పిస్టళ్లు, మందుగుండు సామగ్రిని తీసుకెళ్లడానికి ఒకరి కంటే ఎక్కువ మంది వచ్చింటారని భావిస్తున్నారు. ఈ కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది. మరోవైపు ఆయుధాలు నిజంగా చోరీకి గురయ్యాయా? లేక ఎక్కడైనా ఇతర ప్రాంతంలో ఉంచి, రికార్డుల్లో నమోదు కాకపోవడం వల్ల మిస్సింగ్‌గా గుర్తించారా..? అనే కోణంలోనూ అధికారులు పరిశీలిస్తున్నారు. ఆయుధాల స్టాక్, రికార్డులు, గతంలో జరిగిన ఆడిట్ వివరాలను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.






# స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

- బంగారాన్ని అనవసరంగా కొనకండి
- డెస్టినేషన్ పేరుతో విదేశాల్లో పెళ్లిళ్లకు దూరం కండి
- దేశప్రజల సమిష్టి కృషితోనే జీడీపీ వృద్ధిరేటు
- దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించడం గర్వకారణం
- ఇన్‌స్టా వేదికగా ప్రధాని మోడీ దేశ ప్రజలకు అభినందనలు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** భారత్ సాధించిన వృద్ధి రేటు దేశ సమష్టి శక్తికి నిదర్శనమని భారత ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. నిరాశావాదులు మాత్రం తమ అసత్యాలను వ్యాప్తి చేస్తూనే ఉన్నారని విమర్శించారు. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అడ్డంకుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ మెరుగైన వృద్ధి రేటు సాధించిందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత దేశ జీడీపీ ఏకంగా 7.8శాతం మేర వృద్ధి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు అభినందనలు చెప్పారు. 7.8శాతం వృద్ధి రేటు నమోదవడంతో దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోందన్నారు. దేశ ప్రజల పట్టుదల, శక్తి సామర్థ్యాలు గొప్పవని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నా భారత్ వృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. భారత దేశ ప్రగతిని ఇలాగే కొనసాగించాల్సిన అవసరం ఉందని కూడా ప్రధాని చెప్పారు. ఆత్మనిర్భరత సాధించడం అవసరమని మరోసారి చెప్పారు. స్వదేశీ వస్తువులకు దేశ ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనవసర విదేశీ పర్యటనలు, బంగారం కొనుగోళ్లు వద్దని అన్నారు. విదేశీ మారకనిల్వల పొదుపు కోసం భారత్‌లోనే వివాహాది శుభకార్యాలు జరుపుకోవాలని సూచరించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు అభినందనలు తెలిపిన ఆయన.. గతంలో చేసిన విజ్ఞప్తినే మరోసారి గుర్తుచేశారు. స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలని, విదేశీ ప్రయాణాలు వద్దని, అవసరం లేకుండా బంగారం కొనొద్దని మరోసారి కోరారు. ప్రస్తుతం కిర్గిస్థాన్ పర్యటనలో ఉన్న ఆయన ఈ మేరకు ఇన్‌స్టా వీడియో విడుదల చేశారు. దేశ ప్రజలకు అభినందనలు. 7.8? వృద్ధి గొప్ప విషయం. ప్రజల సంకల్ప బలం, కృషికి ఇది నిదర్శనం. ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ ఈ అసాధారణ ఘనతను దక్కించుకుంది. ప్రపంచం యుద్ధంలో మునిగిపోయింది. ఎటుచూసినా యుద్ధ వార్తలే.. సంక్షోభాలే. సరఫరా గొలుసు పూర్తిగా దెబ్బతింది. 2020లో కొవిడ్ తర్వాత నుంచి నేటి వరకు ఎక్కడా స్థిరత్వం కనిపించడం లేదు. అయినా భారత్ పురోగమిస్తోందని మోదీ తన వీడియోలో పేర్కొన్నారు. పర్యటనల కోసం విదేశాలకు వెళ్లొద్దు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు దూరంగా ఉండండి. 'భారత్‌లోనే వివాహం చేసుకోండి' అనే మంత్రాన్నే మనం పాటిద్దాం. అవసరం లేకపోతే బంగారాన్ని కొనడం మానుకోండి. స్థానికంగా తయారైన వస్తువులు, సేవలు ఎంత ఎక్కువగా ఎంచుకుంటే.. దేశం అంత ఎక్కువగా అభివృద్ధి చెందుతుంది. మనం స్వావలంబనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉంటే.. స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్ల పూర్తయ్యేనాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతామనే విశ్వాసం నాకు ఉందని మోదీ పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేసిన 7 శాతం కంటే ప్రస్తుత వృద్ధి రేటు ఎక్కువ. అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా అనిశ్చితులు, ఇంధన సరఫరాకు అవరోధాలు వంటి పరిస్థితులను తట్టుకొని భారత ఆర్థిక వ్యవస్థ రాణించడం విశేషం. ఈ వృద్ధిని దేశ ప్రజలు వేడుకలా నిర్వహించుకోవాలి. అదే సమయంలో వికసిత్ భారత్ దిశగా కృషి చేయాలి. 140 కోట్ల మంది ప్రజల ఐక్యత.. దేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని ప్రధాని అన్నారు.

# తదుపరి అమెరికా అధ్యక్షుడు ఎవరు?

## తెరపైకి రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేరు

## ఇప్పుడే అలాంటి చర్చ అవసరం లేదన్న ట్రంప్




**వాషింగ్టన్, సెప్టెంబర్ 1 :** అమెరికా తదుపరి అధ్యక్షుడిగా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేరు తెరపైకి వస్తున్న వేళ డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2028 ప్రెసిడెంట్ ఎలక్షన్స్‌లో పోటీచేసే అవకాశాలపై మాట్లాడిన అగ్రరాజ్య అధ్యక్షుడు.. ఆ విషయమై ఇప్పుడే చర్చ అక్కర్లేదని సమాధానాన్ని దాటవేశారు. 'హెగ్సెత్ అద్భుతంగా పని చేస్తున్నారు. అయితే ఇలాంటి విషయాల గురించి మాట్లాడేందుకు ఇది తొందరపాటు చర్య అవుతుంది. ముందుగా నవంబర్‌లో జరిగే మధ్యంతర ఎన్నికలను పూర్తి చేయాలి' అని ట్రంప్ అన్నారు. యూఎస్ ప్రెసిడెంట్‌గా రెండు పర్యాయాలు మాత్రమే కొనసాగే అవకాశమున్న ట్రంప్.. 2029లో ఆ పదవి నుంచి తప్పుకోనున్నారు. దీంతో ఆయన 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' ఉద్యమాన్ని ముందుకు నడిపించే తదుపరి నేత ఎవరన్న దానిపై రిపబ్లికన్ పార్టీలో చర్చ జోరందుకుంది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్లు ఇప్పటికే వినిపిస్తున్నా.. తాజాగా ఆ లిస్ట్‌లో హెగ్సెత్ కూడా ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు ఇటీవల ఐయోవా స్టేట్ ఫెయిర్‌లో రిపబ్లికన్ల తరఫున హెగ్సెత్ ప్రచారం చేయడం ఈ ఊహాగానాలకు బలం చేకూర్చినట్లైంది. అయితే ఈ వార్తలను హెగ్సెత్ ఖండించారు. అవి '100 శాతం అవాస్తవం' అని సోషల్ మీడియాలో పేర్కొన్నారాయన. హెగ్సెత్ గతంలో ఆర్మీ నేషనల్ గార్డ్‌లో పనిచేశారు. అనంతరం ఫాక్స్ న్యూస్ ఛానల్‌లో టీవీ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ప్రస్తుతం ట్రంప్ ప్రభుత్వంలో రక్షణ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే ఆయన రాజకీయ భవితవ్యంపై ట్రంప్ మరింత ఆసక్తికరంగా స్పందించారు. 'ప్రస్తుతం ఆయనకు సైన్యం, సైనికుల సంక్షేమం తప్ప మరేదీ ముఖ్యం కాదు' అని వ్యాఖ్యానించారు. మరోవైపు 2028 అధ్యక్ష ఎన్నికల కోసం పలువురు నేతలు ఇప్పటికే అంతర్గతంగా సన్నాహాలు ప్రారంభించి ఉండొచ్చని ట్రంప్ చెప్పారు. ఏది ఏమైనా ట్రంప్ వారసుడిగా అధికారికంగా ఎలాంటి నిర్ణయం ప్రకటించనప్పటికీ.. జేడీ వాన్స్, మార్కో రూబియో, హెగ్సెత్ వంటి పేర్లు వినిపిస్తుండటం రిపబ్లికన్ పార్టీలో 2028 పోరుపై ఆసక్తి రేపుతోంది.

# రష్యా సైన్యంలో 51మంది భారతీయులు మృతి

## విదేశాంగ శాఖ సెక్రటరీ విక్రమ్ మిశ్రీ వెల్లడి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** రష్యా సైన్యంలోని 51 మంది భారతీయులు మరణించారని విదేశాంగ శాఖ సెక్రటరీ విక్రమ్ మిశ్రీ వెల్లడించారు. మొత్తం 227 మంది రష్యాలో సైన్యంలో చేరగా ఇప్పటివరకూ 139 మంది బయటకు వచ్చేశారని అన్నారు. మిగిలిన వారినీ వెనక్కు తీసుకొచ్చేందుకు రష్యాతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కిర్గిస్థాన్ పర్యటన నేపథ్యంలో సోమవారం మీడియా అడిగిన ప్రశ్నలకు విదేశాంగ శాఖ సెక్రటరీ ఈ వివరాలను వెల్లడించారు. ఈ అంశంలో రష్యాతో వివిధ స్థాయిల్లో చర్చలు జరుగుతున్నాయని మిశ్రీ చెప్పారు. మాస్కోలోని భారతీయ ఎంబసీ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ భారతీయులను వెనక్కు రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. భారతీయులు త్వరగా సైన్యం నుంచి డిశ్చార్జ్ అయ్యేలా రష్యా చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. రష్యా-భారత్ వాణిజ్యం గురించి కూడా మిశ్రీ మాట్లాడారు. గతేడాది భారత్‌లో రష్యన్ దిగుమతిదారుల సమావేశంలో అక్కడి సంస్థలు ఉత్సాహంగా పాల్గొన్నాయని చెప్పారు. భారత్ నుంచి దిగుమతులను పెంచేందుకు ఉత్సుకత ప్రదర్శించాయని చెప్పారు. తదుపరి రష్యాలో జరుగునున్న సమావేశంలో భారతీయ ఎగుమతిదారుల ఫోరం సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ఈ విషయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ సానుకూలంగా స్పందించారని అన్నారు. షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ ఇటీవల కిర్గ్ రిపబ్లిక్ దేశ పర్యటనకు వెళ్లారు. ఈ క్రమంలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కూడా సమావేశం అయ్యారు. యుద్ధాలకు శాశ్వత ముగింపు పలికేందుకు చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

# విమానంలో సాంకేతిక లోపం

## అత్యవసరంగా గోవాలోనే ల్యాండింగ్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** గోవా నుంచి ఢిల్లీ బయలుదేరిన ఇండిగో విమానం ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. మంగళవారం ఉదయం 9.15 గంటలకు గోవా ఎయిర్ పోర్ట్ నుంచి విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఈ సాంకేతిక లోపం ఏర్పడింది. ఈ విషయాన్ని గుర్తించిన విమానం పైలట్ వెంటనే మనోహర్ ఎయిర్ పోర్ట్ అధికారులకు తెలియజేశారు. వారి అనుమతితో ఈ విమానాన్ని అత్యవసరంగా గోవా ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ చేశారు. దీంతో విమానంలోని ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇండిగో విమానం అత్యవసర ల్యాండింగ్ నేపథ్యంతో గోవా ఎయిర్‌పోర్టులో అధికారులు ఫుల్ ఎమర్జెన్సీ ప్రకటించారు. ఈ విమానంలోని ప్రయాణికులను ఢిల్లీ తరలించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తున్నట్లు ఇండిగో యాజమాన్యం ఈ సందర్భంగా వెల్లడించింది. అందుకోసం మరో విమానాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఇండిగో తెలిపింది. విమానం టేకాఫ్ అయిన ఐదు నిమిషాలకే ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తినట్లు పైలట్లు కనుగొన్నారని వివరించింది. విమానంలో ఏర్పడిన సమస్యను గుర్తించే పనిలో సాంకేతిక సిబ్బంది ఉన్నారని పేర్కొంది. ప్రయాణికులతోపాటు విమాన సిబ్బందికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని ఇండిగో సంస్థ తెలిపింది.

# జీడీపీ వృద్ధిరేటు గణాంకాల గారడీ

## ధరలు మోత మోగిస్తుంటే..వృద్ధి ఎలా సాధ్యం

## ప్రధాని వ్యాఖ్యలపై మండిపడ్డ జైరామ్ రమేశ్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:** భారత దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించిందన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలపై రాజ్యసభ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శలు గుప్పించారు. అవన్నీ ప్రచారార్భాటమేనని కొట్టిపారేశారు. గణంకాల గారడీతో మోదీ ప్రభుత్వం ప్రజలను భ్రమల్లో ముంచెత్తు తోందని ఎంపీ జైరాం రమేశ్ ఆరోపించారు. దేశంలో పెట్టుబడులు, వినియోగం మందగించాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం 'హై వోల్టేజ్' ధరల భారాన్ని సామాన్యులపై మోపుతోందని ఆరోపించారు. ముడిసరకుల ధరలు పెరగడంతో సామాన్యుల సొంతింటి కలలు కల్లలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరాభారం కేవలం వంటింటికే పరిమితం కాలేదని అన్నారు. రాగి వైర్ ధర రూ.850 నుంచి రూ.1,700కి, అల్యూమినియం ధర రూ.350 నుంచి రూ.650 కి చేరిందని వెల్లడించారు. 1,000 చదరపు అడుగుల ఇంటికి వైరింగ్ ఖర్చు రూ.50 వేల నుంచి లక్ష రూపాయిలకు పెరిగిందని చెప్పారు. హోమ్ అప్లయన్సెస్, ఎల్‌ఈడీ లైట్లు, ఫ్యాన్లు, సోలార్ ప్యానెళ్ల ధరలు 10 నుంచి 20 శాతం వరకు పెరిగాయని అన్నారు. స్విచ్ సాకెట్లు, మెయిన్ లైన్ కేబుల్స్, టైల్స్, కార్మికులు ఖర్చు ఇలా అన్ని పెరిగాయని అన్నారు. ధరాభారం అన్ని వైపుల నుంచి ప్రజలకు షాకులిస్తోందని వ్యాఖ్యానించారు. ఇంత జరుగుతున్నా కూడా మోదీ ప్రభుత్వం మాత్రం వాస్తవాలను మరుగున పరిచి, గణాంకాలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తూ ఉందని మండిపడ్డారు. త్రైమాసిక జీడీపీ గణాంకాలు దేశంలోని పరిస్థితుల్ని తప్పుగా చూపిస్తున్నాయని అన్నారు. వీక్ సెంటీమెంట్‌ను ప్రతిఫలించట్లేదని చెప్పారు. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత జీడీపీ 7.8 శాతం వృద్ధి సాధించడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. భారత్ ప్రగతిబాటలో దూసుకుపోతుంటే నిరాశావాదులు మాత్రం అసత్యాలను ప్రతిధ్వనిస్తున్నారని విమర్శించారు. ఈ వృద్ధి



రేటు భారతీయుల సమష్టి శక్తికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఈ వృద్ధి రేటుకు కొనసాగించేందుకు భారతీయులు దేశీయ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని కూడా సూచించారు.

# 1000 రోజుల్లో అభివృద్ధికి పెద్దపీట

- తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం: ఇంద్రమ్మ ఇళ్లకు పెద్దపీట

**మిషన్ భగీరథకు రూ.210 కోట్లు: రైతుల కోసం రూ.20 కోట్లతో గోదాంలు**




**ఆలేరు, సెప్టెంబరు 1(సమయం న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా ఆలేరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నాయకులు వివరించారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంతో పాటు తాగునీరు, గృహాలు, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.

**ప్రతి ఇంటికీ నల్లా నీరే లక్ష్యం**

ఆలేరు నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మిషన్ భగీరథలో గతంలో పెండింగ్‌లో ఉన్న సుమారు 16 కి.మీ. పైప్‌లైన్ పనులకు రూ.210 కోట్ల నిధులు మంజూరు చేయించామని పేర్కొన్నారు. ఇప్పటికే 11 కి.మీ. పనులు పూర్తయ్యాయని, మిగిలిన 4.5 కి.మీ. పనులకు అటవీ అనుమతుల సమస్య ఉందని తెలిపారు. కేంద్రం నుంచి అనుమతులు పొందేందుకు చర్యలు కొన సాగుతున్నాయని చెప్పారు. పనులు పూర్తయితే ప్రతి ఇంటికీ 24 గంటల తాగునీటితో పాటు వ్యక్తికి రోజుకు సుమారు 100 లీటర్ల నీరు అందించడమే లక్ష్యమన్నారు.

**2,800 ఇళ్లలో గృహ ప్రవేశాలు**

ఆలేరు నియోజకవర్గానికి పెద్ద ఎత్తున ఇంద్రమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, ఇప్పటివరకు సుమారు 2,800కుపైగా ఇళ్ల లో గృహ ప్రవేశాలు లేదా నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. అర్హులైన పేద కుటుంబాలందరికీ దశల వారీగా ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

**32,470 మంది రైతులకు రుణమాఫీ**

ఆలేరు నియోజకవర్గంలో 32,470 మంది రైతులకు రూ.258 కోట్ల మేర రుణమాఫీ జరిగినట్లు తెలిపారు. సాంకేతిక కారణాలతో కొందరికి ఆలస్యం జరిగి ఉండవచ్చని పేర్కొన్నారు.

**14,885 కొత్త రేషన్ కార్డులు**

నియోజకవర్గంలో 14,885 కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయని, 25,443 కొత్త యూనిట్లు నమోదు చేసినట్లు తెలిపారు. రేషన్ కార్డు ద్వారా బియ్యం పొందడంతో పాటు పలు సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతులకు రూ.20 కోట్ల తో గోదాంలు రైతులు పండించిన ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేసుకునేందుకు సుమారు రూ.20 కోట్లతో గోదాంల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఆలేరు మార్కెట్‌లో గోదాం నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు. అవసరాన్ని బట్టి మరిన్ని ప్రాంతాల్లో గోదాంలు నిర్మిస్తామని పేర్కొన్నారు. రైతు పండించిన పంట వర్షాలకు తడిసి నష్టపోకుండా సకాలంలో కొనుగోలు చేయడంతో పాటు అవసరమైన నిల్వ సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని నాయకులు తెలిపారు. రాబోయే రోజుల్లో పెండింగ్ పనులను పూర్తి చేసి ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని వెల్లడించారు.

## ఆచరణాత్మక విద్యతోనే సృజనాత్మకత: కలెక్టర్ భవేష్ మిశ్రా



**నిర్మల్, సెప్టెంబర్ 1( సమయం న్యూస్):** పుస్తక పరిజ్ఞానంతో పాటు ఆచరణాత్మక విద్య అందిస్తే విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. తానూరు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వందశాతం ఉండాలని, పదో తరగతి పరీక్షలకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేయాలని సూచించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. అంతకుముందు మొగిలి గ్రామంలో పీఏసీఎల్ భూ బాధిత రైతులతో సమావేశమైన కలెక్టర్, బాధితుల వివరాలను సమగ్రంగా సేకరించి నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే భూముల సర్వే నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## 22-A జాబితా నుంచి నిజమైన ప్రైవేట్ ఆస్తులను తొలగించాలి:

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజిగిరి, సెప్టెంబర్ 1( సమయం న్యూస్)** 22-A నిషేధిత ఆస్తుల జాబితాలో పొరపాటున చేరిన నిజమైన ప్రైవేట్ ఆస్తులను తొలగించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి CCLA కమిషనర్ లోకేష్ కుమార్‌ను కోరారు. మంగళవారం సచివాలయంలో ఆయనను కలిసి సంబంధిత సర్వే నంబర్లు, ఆస్తుల వివరాలతో వినతిపత్రం సమర్పించారు. చట్టబద్ధ పత్రాలు ఉన్న ఆస్తులకు న్యాయం చేయాలని కోరగా, పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు.

## క్రిటికల్ మినరల్స్‌పై తెలంగాణ ఫోకస్



- మోనాష్–ఐఐటీ హైదరాబాద్–సింగరేణి సంయుక్త పరిశోధనకు ముందడుగు

**హైదరాబాద్:సెప్టెంబర్1(సమయం న్యూస్)** క్రిటికల్ మినరల్స్ అన్వేషణ, వెలికితీత, శుద్ధి సాంకేతికతలపై దీర్ఘకాలిక పరిశోధనకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజాభవన్‌లో మోనాష్ యూనివర్సిటీ, ఐఐటీ హైదరాబాద్, సింగరేణి ప్రతినిధులతో జరిగిన సమావేశంలో మూడు సంస్థ ల సంయుక్త భాగస్వామ్యంపై చర్చించారు. పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ వాహనాలు, బ్యాటరీ నిల్వ వ్యవస్థ లు, ఎలక్ట్రానిక్స్ రంగాలకు క్రిటికల్ మినరల్స్ కీలకమని భట్టి పేర్కొన్నారు. తెలంగాణను కేవలం వినియోగదారుగా కాకుండా ఖనిజ విలువ శృంఖలిలో కీలక భాగస్వామిగా తీర్చిదిద్దాలని సూచించారు. ఐఐటీ హైదరాబాద్‌లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను బలోపేతం చేసి, ఖనిజ అన్వేషణ, శుద్ధి, వ్యర్థాల నుంచి క్రిటికల్ మినరల్స్ పునరుద్ధరణ వంటి అంశాల్లో ఆధునిక సాంకేతికతలను అభివృద్ధి చేయాలని కోరారు. ఈ భాగస్వామ్యానికి త్వరగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మూడు సంస్థల పాత్రలను స్పష్టంగా వివరించండి

## క్వాంటం భద్రతలో భారత్ ముందడుగు



- 14 స్వదేశీ క్వాంటం ఉత్పత్తులను ఆవిష్కరించిన సీ-డాట్

**న్యూఢిల్లీ, ఆగస్టు 1 సమయం న్యూస్)(** దేశ కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లను భవిష్యత్ క్వాంటం సైబర్ ముప్పుల నుంచి రక్షించే లక్ష్యంతో సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ (C-DOT) 14 స్వదేశీ క్వాంటం ఉత్పత్తులను ఆవిష్కరించింది. సీ-డాట్ 43వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలో వీటిని విడుదల చేశారు. క్వాంటం కీ డిస్ట్రిబ్యూషన్ (QKD), పోస్ట్-క్వాంటం క్రిప్టోగ్రఫీ (PQC) సాంకేతికతల ఆధారంగా వీటిని అభివృద్ధి చేశారు. Q-AKSHAY, Q-SETU, Q-MAHASETU, Q-VIKRAM, Q-AMOGH, Q-DARSHAN, Q-VAAYU, Q-VAJRA1000, Q-PARAKRAM తదితర ఉత్పత్తులు టెలికాం, ఎంటర్‌ప్రైజ్, వైర్‌లెస్, ఆప్టికల్, రక్షణ రంగాల కమ్యూనికేషన్లకు క్వాంటం-సేఫ్ భద్రత కల్పించనున్నాయి. భవిష్యత్ క్వాంటం కంప్యూటర్ల వల్ల ప్రస్తుత ఎన్‌క్రిప్షన్ వ్యవస్థలకు ఎదురయ్యే ముప్పులను తట్టుకునేలా ఈ పరిష్కారాలను రూపొందించినట్లు కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ తెలిపింది. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, సహాయ మంత్రి చంద్రశేఖర్ పెమ్మసాని తదితరులు క్వాంటం ప్రొడక్ట్ సిరీస్ బుక్‌లెట్‌ను కూడా ఆవిష్కరించారు.

## ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి: కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 1 (సమయం న్యూస్)):** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం, నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి జిల్లా స్థాయి పర్యవేక్షణ, సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో నమోదైన కేసుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, బాధితులకు పునరావాసం కల్పించడంతో పాటు వారి హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, చట్టపరమైన లోపాలకు తావులేకుండా పకడ్బందీగా దర్యాప్తు నిర్వహించి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పారా యార్డు రీమోడలింగ్‌కు రూ.125 కోట్లు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:( సమయం న్యూస్)** గుజరాత్‌లోని భavnagar పారా రైల్వే యార్డు పునర్వ్యవస్థీకరణ ప్రాజెక్టుకు భారతీయ రైల్వే సుమారు రూ.125 కోట్లు మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టుతో భavnagar టెర్మినస్‌లో రద్దీ తగ్గి, రైళ్ల నిర్వహణ మరింత సులభం కానుంది. పథకంలో నాలుగు లూప్ లైన్లు , ఇంజిన్ రివర్సల్ లైన్, కొత్త హై-లెవల్ ప్లా ట్‌ఫాం, ప్లా ట్‌ఫాం విస్తరణ, ఫుట్ ఓవర్ బ్రిడ్జి పొడిగింపు, మరో కొత్త ఎఫ్‌ఓబీ, రెండు రోడ్ అండర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టనున్నారు. యార్డు సామర్థ్యం పెరగడంతో రేక్ నిలుపుదల సమయం తగ్గి, రైళ్ల సమయపాలన మెరుగుపడటంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందనున్నాయని రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది. కావాలంటే దీనిని ఇంకా 2–3 లైన్ల స్క్రోలింగ్ వార్తగా కూడా ఇస్తాను.

## సమాచార, పౌర సంబదాల శాఖ అదనపు సంచాలకులుగా డి.ఎస్. జగన్.

**హైదరాబాద్, సెప్టెంబర్ 1:( సమయం న్యూస్)** సమాచార, పౌర సంబంధాల శాఖలో డి.ఎస్. జగన్ అదనపు సంచాలకుడిగా (Additional Director) పదోన్నతి పొందారు. పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డి.ఎస్. జగన్ డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివా లయంలో గౌరవరాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి డి.ఎస్. జగన్‌కు పదోన్నతి సందర్భంగా అభినందనలు తెలియ జేశారు. సమాచార, పౌర సంబంధాల శాఖ ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరవేయడంతో పాటు ప్రభుత్వం, ప్రజలు, మీడియా మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని మంత్రి ఆకాంక్షించారు. అనంతరం డి.ఎస్. జగన్ సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ డా. జి. ముకుంద రెడ్డి గారిని కూడా మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పెషల్ కమిషనర్ ఆయనకు పదోన్నతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అదనపు సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించిన డి.ఎస్. జగన్ మాట్లాడుతూ, తనపై ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిల బెట్టుకునేలా విధులను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల సమాచారాన్ని ప్రజలకు విస్తృతంగా చేరవేయడంలో శాఖ అధికారులతో సమన్వయంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, సిబ్బంది డి.ఎస్. జగన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



## ఆరోగ్యవంతమైన చిన్నారులతోనే బలమైన భారత్: డాక్టర్ కె. లక్ష్మణ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 1( సమయం న్యూస్)** ఆరోగ్యవంతమైన చిన్నారులతోనే బలమైన దేశ నిర్మాణం సాధ్యమవుతుందని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. హైదరాబాద్‌లో సీబీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ మాసోత్సవం–2026 ఐకాప్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పోషకాహారం, చిరుధాన్యాలు, క్రీడలు, యోగా ప్రాధాన్యంపై ప్రజల్లో అవగాహన పెంచాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో చిన్నారుల ఎదుగుదల లోపం 33 శాతం నుంచి 27 శాతానికి తగ్గిందన్నారు. సెప్టెంబర్ 5 వరకు ప్రదర్శనలు, నిపుణుల ప్రసంగాలు, జానపద కళా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమ వివరాలను మరింత స్పష్టంగా చేయండి




## పోలీస్ విధులకు ఆటంకం కేసులో నిందితుడికి శిక్ష

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 1:( సమయం న్యూస్)** ఉట్నూర్‌లో 2022లో విధుల్లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్‌పై దాడి చేసి, దుర్భాష లాడుతూ బెదిరింపులకు పాల్పడి విధులకు ఆటంకం కలిగించిన రాథోడ్ గోపాల్ (37)ను ఉట్నూర్ జేఎఫ్‌సీఎం కోర్టు దోషిగా నిర్ధారించింది.

క్రైమ్ నం.25/2022, సెక్షన్ 353 ఐపీసీ కింద నమోదైన కేసులో నిందితుడికి రూ.3,000 జరిమానా లేదా ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. కేసు విచారణలో ఏడుగురు సాక్షులను ప్రవేశ పెట్టగా, సమర్థవంతంగా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా

## అస్తవ్యస్తంగా రాజీవ్ గృహకల్ప సముదాయం

### పట్టించుకోని అధికారులు

### ఇబ్బందులు పడుతున్న ప్రజలు

**శంషాబాద్ సెప్టెంబర్1:** శంషాబాద్ పట్టణంలోని ఇంద్ర రెడ్డి నగర్ వద్ద నిర్మాణం చేసిన రాజీవ్ గృహకల్ప సమోదాయం శిథిలావస్థకు చేరుకోవడంతో అందులో నివాసం ఉంటున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాసిరకంగా నిర్మాణం చేయడంతో పాటు డ్రైనేజ్ పైపులు సక్రమంగా ఇండ్ల లో నుంచి వచ్చే మురుగునీరు ఇండ్ల మధ్యలోనే నిలిచి తీవ్ర దుర్వాసన వెదజలుతుందని స్థానికులు తెలిపారు. మురుగునీరుతో పాటు చెత్త పేరుకుపోవడంతో దోమలు ఈగలు సైర విహారం చేస్తున్నాయని స్థా నికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని రాజీవ్ గృహకల్ప సముదాయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

## విద్యార్థుల భద్రత, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 1: ( సమయం న్యూస్)** జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, KGBVల్లో విద్యార్థు ల భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రత, విద్యా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచి నెలకు ఒకసారి వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల ప్రతిభ, ఆంగ్ల నైపుణ్యాల పెంపునకు మోటివేషన్ కార్యక్రమాలు, స్లిప్ టెస్టులు, గ్రూప్ డిస్కషన్లు నిర్వహించాలని తెలిపారు. అధికారులు ప్రతి 15 రోజులకు విద్యాసంస్థలను సందర్శించి పరిస్థితులను పరిశీలించాలని ఆదేశించారు.

## సీపీఎస్ రద్దు చేయాలి: రెండో పీఆర్సీ ప్రకటించాలి

### పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా ఆలేరులో ఉద్యోగుల జేఏసీ నిరసన



**ఆలేరు, సెప్టెంబర్1(సమయం న్యూస్):** పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆలేరు మండల ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం పెన్షన్ విద్రోహ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలేరు మండల రెవెన్యూ కార్యాలయంలో గ్రామ పరిపాలనాధికారి సత్తిరెడ్డికి జేఏసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని నాయకులు కోరారు. అలాగే ఉద్యోగులకు రావాల్సిన బకాయి డీఏలను వెంటనే చెల్లించడంతో పాటు, తెలంగాణ రెండో పీఆర్సీని త్వరిత గతిన ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం ఆర్థిక భద్రతపై ఆందోళన చెందుతున్నారని నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, పెన్షన్ విషయంలో స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పసుపులేటి నరేంద్రస్వామి, రిటైర్డ్ ఉద్యోగుల తరపున పూల నాగయ్య, మాజీ డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, గుండు జగన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మండల విద్యాధికారి పదవి విరమణ కార్యక్రమం

### హాజరైన తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



**తాండూర్, సెప్టెంబర్,01(సమయం న్యూస్)** ఎంతో మంది విద్యార్థులను ఉన్నత ఉద్యోగులుగా తీర్చిదిద్దిన యాలాల మండల విద్యాధికారి మహిపాల్ రెడ్డి పదవి విరమణ కార్యక్రమం తోటి ఉద్యోగుల, పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం గగ్రాని ఫంక్షన్ హాల్లో పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. సన్మాన కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి మహిపాల్ రెడ్డి పుణ్య దంపతులకు పూలమాలవేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ... ఉద్యోగం విషయంలో ఎక్కడ రాజీ పడకుండా తను పదవీ విరమణ వరకు ఎంతోమంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దారని పలువురు వక్తలు కొనియాడారు.ఈ సందర్భంగా పదవి విరమణ పొందిన మండల విద్యాధికారి మైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. పదవి విరమణ పొందిన తర్వాత కాలం కూడా విద్యా వ్యవస్థ బలోపేతానికి అని నిత్యం సలహాలు సూచనలను అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు, బంధువులు, తోటి ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు మహిపాల్, పి ఆర్ టి యు మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి తదితరులున్నారు.

## సన్న వడ్ల రైతులు విత్తన వివరాలు నమోదు చేసుకోవాలి

### క్వింటాల్ కు రూ.500 బోనస్ పొందాలంటే తప్పనిసరి: కొలనుపాక ఏఈఓ శివకుమార్



**ఆలేరు, సెప్టెంబర్1(సమయం న్యూస్):** సన్న వరి సాగు చేసిన రైతులు ప్రభుత్వం అందించే క్వింటాల్‌కు రూ.500 బోనస్ పొందాలంటే విత్తనాల వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కొలనుపాక వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) శివకుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న వరి సాగును ప్రోత్సహించేందుకు ఎంపిక చేసిన ఏడు రకాల సన్న ధాన్యాన్ని కొనుగోలు చేసే సమయంలో క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సన్న వరి సాగు చేస్తున్న రైతులు తాము కొనుగోలు చేసిన విత్తనాల వివరాలను సంబంధిత డీలర్ వద్ద ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఎంపిక చేసిన బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-15048 (తెలంగాణ సోనా), హెచ్ఎంటీ సోనా, డబ్ల్యూజీఎల్-44 (సిద్ధి), కేఎన్ఎం-1638, కేఎన్ఎం-7715, జైశ్రీరాం రకాల సన్న వరిని సాగు చేస్తున్న రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్ వద్దకు పట్టాదారు పాస్‌బుక్, మొబైల్ నంబర్ తీసుకెళ్లి విత్తనాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. డీలర్ వద్ద విత్తనాలు కొనుగోలు చేయకుండా వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా స్థానాల నుంచి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు, అలాగే సొంత విత్తనంతో సన్న వరి సాగు చేస్తున్న రైతులు స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పించి వ్యవసాయ శాఖ అధికారుల వద్ద తమ పంట వివరాలను నమోదు చేసుకోవచ్చని ఏఈఓ తెలిపారు. ఈ ప్రక్రియను ఈనెల 10లోపు పూర్తి చేసుకోవాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం అందించే బోనస్ పొందేందుకు రైతులు గడువులోగా విత్తనాల వివరాల నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.

# యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు చేరిన నైనీ మైన్ తొలి బొగ్గు రేక్:

**దామరచర్ల సెప్టెంబర్ 1,( సమయం న్యూస్):** యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (YTPS) విద్యుత్ ఉత్పత్తిలో ఒక కీలకమైన మైలురాయిని అధిగమించింది. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (SCCL) ఆధ్వర్యంలో నడుస్తున్న ఒడిశాలోని 'నైనీ' బొగ్గు గని నుండి సేకరించిన అత్యంత నాణ్యమైన బొగ్గుతో కూడిన మొదటి రైల్వే రేక్ (రైలు) 4000 టన్నుల బరువుతో ఈరోజు ప్లాంట్‌కు చేరుకుంది. ఈ తొలి బొగ్గు రేక్‌ను టీజీజెన్‌కో (TGGENCO) డైరెక్టర్ (బొగ్గు & లాజిస్టిక్స్) శ్రీ బి.నాగ్య, మరియు డైరెక్టర్ (థర్మల్ & ప్రాజెక్ట్స్) శ్రీ వై. రాజశేఖర్ రెడ్డిలు ఘనంగా స్వాగతించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్లు శ్రీనివాసరావు, సురేష్, సూర్య నారాయణలు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ముఖ్య విశేషాలు:**

★ విద్యుత్ రక్షణకు భరోసా: నైనీ బ్లాక్ నుండి వచ్చిన అధిక నాణ్యత (High-Calorific Value) కలిగిన ఈ బొగ్గు, రాష్ట్ర ఇంధన అవసరాలను తీర్చడానికి మరియు గరిష్ట సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి చేయడానికి ఎంతో దోహదపడుతుంది. ఒడిశా నుండి సుదీర్ఘ దూరం సుమారు 1050 కిలోమీటర్లు రవాణా చేయాల్సి వచ్చినప్పటికీ, ఈ బొగ్గు యొక్క ఉత్తమ నాణ్యత మరియు అధిక ఉష్ణ సామర్థ్యం కారణంగా బాయిలర్ల పనితీరు మెరుగవుతుంది. ఇది బూడిద (Ash) సమస్యలను తగ్గించి రవాణా వ్యయాన్ని పూర్తిగా సమర్థిస్తుంది.

★ సమన్వయంతో విజయం: గౌరవ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు గారి ప్రత్యేక చొరవతో టీజీజెన్‌కో, సింగరేణి (SCCL), మరియు భారతీయ రైల్వేల మధ్య అద్భుతమైన సమన్వయం సాధించి సుదూర రవాణా ప్రక్రియ విజయవంతంగా సాధ్యమైంది. రాబోయే రోజుల్లో నైనీ మైన్ నుండి నిరంతరాయంగా బొగ్గు రేకులు రావడం వల్ల వైటీపీఎస్ లో తగినంత బొగ్గు నిల్వలు (Coal Stocks) అందుబాటులో ఉంటాయి. ఇది రాష్ట్రానికి నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించడానికి గ్యారెంటీ ఇస్తుంది.

# సమాచార శాఖలో పదోన్నతుల పరంపరకు శ్రీకారం

- **అదనపు డైరెక్టర్‌గా డి.ఎస్. జగన్.. జాయింట్ డైరెక్టర్‌గా మధుసూదన్**
- **తదుపరి క్యాడర్లలోనూ పదోన్నతులకు మార్గం సుగమం**
- **సమాచార శాఖ అధికారులు,ఉద్యోగుల్లో హర్షా తిరేకం,మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ఉద్యోగులు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 1(సమయం న్యూస్)** సమాచార పౌర సంబంధాల శాఖలో పదోన్నతుల ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. శాఖలోని వివిధ క్యాడర్లలో ఖాళీగా ఉన్న పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేసే ప్రక్రియలో భాగంగా డి.ఎస్. జగన్‌ను అదనపు డైరెక్టర్‌గా, మధుసూదన్‌ను జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. తాజా పదోన్నతులతో శాఖలో దీర్ఘకాలంగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న అధికారులు, ఉద్యోగుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. పైస్థాయి పోస్టు ల్లో పదోన్నతులు కల్పించడంతో తదుపరి క్యాడర్లలో ఖాళీల భర్తీకి కూడా మార్గం సుగమం కావడంతో శాఖలో పదోన్నతుల పరంపర కొనసాగేందుకు అనుకూల వాతావరణం ఏర్పడింది.

**DPC ప్రక్రియ పూర్తి.. మంత్రి ఆమోదంతో ఉత్తర్వులు**

శాఖలోని వివిధ క్యాడర్లలో ఖాళీగా ఉన్న పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేసేందుకు డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (DPC) ప్రక్రియను పూర్తి చేసింది. అనంతరం పదోన్నతులకు సంబంధించిన ఫైల్ శాఖ మంత్రి ఆమోదం కోసం పంపబడింది. మంత్రి ఆమోదం లభించడంతో తాజాగా ప్రభుత్వం పదోన్నతులకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శాఖలో పదోన్నతుల ప్రక్రియకు అధికారికంగా శ్రీకారం చుట్టినట్లయింది. డిప్యూటీ డైరెక్టర్లతో పాటు కింది క్యాడర్లకు కూడా అవకాశం అదనపు డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్ స్థాయిలో పదోన్నతులు కల్పించడంతో తదుపరి క్యాడర్లలో ఖాళీలు ఏర్పడి, వాటిని నిబంధనల ప్రకారం పదోన్నతుల ద్వారా భర్తీ చేసేందుకు అవకాశం ఏర్పడింది. ముఖ్యంగా డిప్యూటీ డైరెక్టర్ పోస్టులతో పాటు కింది స్థాయి క్యాడర్లలోనూ పదోన్నతుల ప్రక్రియ ముందుకు సాగేందుకు తాజా ఉత్తర్వులు దోహదపడనున్నాయి. దీంతో పైస్థాయి నుంచి కింది స్థాయి వరకు వివిధ క్యాడర్లలో పదోన్నతులకు మార్గం సుగమమవుతుందని శాఖ అధికారులు, ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**28 ఏళ్ల సర్వీసు ఉన్న అధికారులకు ఆశలు**

సమాచార పౌర సంబంధాల శాఖలో దాదాపు 28 సంవత్సరాలుగా సేవలందిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారులు సైతం తదుపరి పదోన్నతుల కోసం చాలాకాలంగా ఎదురుచూస్తున్నారు.

వివిధ క్యాడర్లలో పదోన్నతులు పరస్పరం అనుసంధానమై ఉండటంతో పైస్థాయి పదోన్నతులు పూర్తయితే తదుపరి స్థాయిల్లోనూ ప్రమోషన్లకు అవకాశం ఏర్పడుతుంది. తాజా పదోన్నతులతో ఈ ప్రక్రియకు అవసరమైన కదలిక ప్రారంభమైంది.

**ఉద్యోగుల విజ్ఞప్తులకు సానుకూల స్పందన**

శాఖలో పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులు, ఉద్యోగులు పలుమార్లు ఉన్నతాధికారులను, శాఖ మంత్రిని కలిసి విజ్ఞప్తులు చేశారు. వారి విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వం తాజాగా పదోన్నతులు కల్పించడం పట్ల ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పదోన్నతుల కోసం దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఉద్యోగులకు తాజా నిర్ణయం కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిందని, ఇక మిగిలిన క్యాడర్లలోనూ పదోన్నతుల ప్రక్రియ వేగంగా కొనసాగుతుందన్న నమ్మకం ఏర్పడిందని ఉద్యోగులు పేర్కొంటున్నారు.

**ప్రభుత్వానికి-ప్రజలకు వారధిగా సమాచార శాఖ**

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా సమాచార పౌర సంబంధాల శాఖ కీలక బాధ్యతలను నిర్వహిస్తోంది. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో శాఖ ముఖ్యపాత్ర పోషిస్తోంది. అదేవిధంగా జర్నలిస్టుల సంక్షేమం, మీడియా-ప్రభుత్వ సమన్వయం కోసం శాఖ అధికారులు, సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారు. ఇలాంటి కీలకమైన శాఖలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులకు పదోన్నతులు లభించడం ద్వారా వారి వృత్తిపరమైన ప్రగతికి మరింత ప్రోత్సాహం లభించడంతో పాటు శాఖ పనితీరు మరింత బలోపేతం కానుంది.

**శాఖలో నూతనోత్సాహం**

తాజా పదోన్నతులతో సమాచార పౌర సంబంధాల శాఖలో సానుకూల వాతావరణం నెలకొంది. పైస్థాయి నుంచి కింది స్థాయి వరకు వివిధ క్యాడర్లలో పదోన్నతుల ప్రక్రియను నిబంధనల ప్రకారం వేగవంతంగా పూర్తి చేస్తారన్న ఆశాభావాన్ని అధికారులు, ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు. అదనపు డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన డి.ఎస్. జగన్, జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన మధుసూదన్‌కు సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, ఉద్యోగులు, జర్నలిస్టులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వారి పదోన్నతులు శాఖలో మరిన్ని క్యాడర్లకు పదోన్నతుల ప్రక్రియ ముందుకు సాగేందుకు దోహదపడటంతో పాటు, ఉద్యోగుల్లో వృత్తిపరమైన ఉత్సాహాన్ని మరింత పెంచుతాయని వారు ఆకాంక్షించారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన సీఎం ప్రధాన కార్యదర్శి



**మద్దూరు మండలం, సెప్టెంబర్,01(సమయం న్యూస్)** రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి సెప్టెంబర్ 4న నారాయణపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించేందుకు రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి శ్రీధర్ ఐఏఎస్ మంగళవారం పరిశీలించారు.జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి తో కలిసి మద్దూరు పరిసర ప్రాంతాల్లో పర్యటించి వివిధ అభివృద్ధి పనులు, హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు.ముందుగా మద్దూరు సమీపంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం చింతల్‌దిన్నె మార్గంలో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల/కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించి పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.గురుకుల పాఠశాల/కళాశాల నిర్మాణ ప్రాంగణంలో భవన నిర్మాణానికి సంబంధించిన మ్యాప్, పనుల టైమ్‌లైన్‌తో కూడిన సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి మార్చి నెలలోపు పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్ ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్ పరిశీలించారు. మద్దూరు సమీపంలోని డిగ్రీ కళాశాల భవనం వద్ద ఒక స్థలంతో పాటు చింతల్‌దిన్నె సమీపంలోని మరో స్థలాన్ని పరిశీలించి, హెలిప్యాడ్ ఏర్పాటుకు అవసరమైన భద్రతా, సాంకేతిక ప్రమాణాలను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులకు సూచించారు.ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సీఎం ప్రధాన కార్యదర్శి శ్రీధర్ అధికారులను ఆదేశించారు.

## వైరల్‌జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

- **ఏరియా ఆసుపత్రిని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్**
- **మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్**

**ఆలేరు, సెప్టెంబర్ 1(సమయం న్యూస్):** ఆలేరు పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో వైరల్ ఫీవర్, సీజనల్ వ్యాధులతో చికిత్స పొందుతున్న రోగులను మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ మంగళవారం పరామర్శించారు. ఆసుపత్రిలోని రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడి ఆసుపత్రికి వస్తున్న రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా బూడిద భిక్షమయ్యగౌడ్ మాట్లాడుతూ వర్షాకాలంలో వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధులు అధికమయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా చర్యలు తీసుకోవడంతో పాటు పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, వైద్య సదుపాయాలు కల్పించి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. సీజనల్ వ్యాధుల నివారణకు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు పుట్ట మల్లేష్‌గౌడ్, మండల సెక్రటరీ జనరల్ రచ్చ రామ్‌నరసయ్య, కౌన్సిలర్ యాట శివ, బీజని మధుకుమార్, కుండే సంపత్, జింకల రామకృష్ణయాదవ్, మాదని ఫిలిప్స్, కర్రె అశోక్, పూల శ్రావణ్, ఎండీ గోరీమియా, జింకల భరత్‌యాదవ్, మొరిగాడి అశోక్, ఎండీ మహమ్మద్, ఎండీ ఫయాజ్, టింకు, ఏలగల హరికృష్ణ, హరిగచంద్రశేఖర్‌తో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.





# పాక్ క్రికెట్‌లో ముసలం!

## సెలెక్టర్ పదవికి మిస్బా రాజీనామా

## సీనియర్ల వేటుపై తీవ్ర అసంతృప్తి

## ఏడుగురు ఆటగాళ్లను ఇంటికి పంపిన పీసీబీ

## కోచ్ సర్ఫరాజ్, ఉమర్ గుల్‌పైనా వేటు

## ఇంగ్లండ్ చేతిలో సిరీస్ కోల్పోయిన పాక్

**లండన్:** అనిశ్చితికి మారుపేరుగా నిలిచే పాకిస్థాన్ క్రికెట్‌లో మరోసారి ముసలం మొదలైంది. ఇంగ్లండ్ పర్యటనలో వరుస పరాజయాల నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తీసుకున్న కఠిన నిర్ణయాలు జట్టులో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. సిరీస్ మధ్యలోనే సీనియర్ ఆటగాళ్లను స్వదేశానికి పంపడంతో పాటు కోచింగ్ బృందంపైనా వేటు వేయడాన్ని నిరసిస్తూ సెలెక్టర్ మిస్బావుల్ హక్ తన పదవికి రాజీనామా చేశాడు. లార్డ్స్ టెస్టులో పాకిస్థాన్ ఘోర పరాజయం తర్వాత పీసీబీ ప్రక్షాళనకు దిగింది. జట్టులోని ఏడుగురు ఆటగాళ్లను స్వదేశానికి పంపాలని నిర్ణయించింది. అంతటితో ఆగకుండా కోచ్ సర్ఫరాజ్ అహ్మద్‌ను బాధ్యతల నుంచి తప్పించి.. మూడో టెస్టుకు వైట్‌బాల్ కోచ్ మైక్ హెసన్‌కు బాధ్యతలు అప్పగించింది. బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌పైనా వేటు వేసింది. తాము ఎంపిక చేసిన జట్టులోని ఆటగాళ్లను సిరీస్ మధ్యలోనే తొలగించడం, కోచింగ్ బృందాన్ని మార్చడంపై మిస్బా తీవ్ర అసంతృప్తికి గురైనట్లు సమాచారం. బోర్డు నిర్ణయాలతో మనస్తాపం చెందిన అతడు మంగళవారం సెలెక్టర్ పదవికి హఠాత్తుగా రాజీనామా చేశాడు. అయితే మిస్బా రాజీనామాను పీసీబీ ఇంకా ఆమోదించాల్సి ఉంది. నేషనల్ క్రికెట్ అకాడమీలో బ్యాటింగ్ కోచ్ బాధ్యతల నుంచి కూడా అతడు తప్పుకునే అవకాశమున్నట్లు తెలుస్తోంది. లార్డ్స్ టెస్టు పరాజయం తర్వాత మహ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్, సల్మాన్ అఘా, అలీ ఉస్మాన్, అమీర్ జమాల్, అవైస్ జఫార్, ఖుర్రం షెహజాద్‌లను జట్టు నుంచి తప్పించినట్లు సమాచారం. వీరి స్థానంలో సయీం అయూబ్‌తో పాటు అరాఫత్ మిన్హాస్, మహ్మద్ ఇమ్రాన్, సాద్ బైగ్, ఇమ్రాన్ రంధవా, రజుల్లాహ్ తదితర యువ ఆటగాళ్లకు చివరి టెస్టులో అవకాశం కల్పించనున్నారు. హెడింగ్లేలో తొలి టెస్టును సొంతం చేసుకున్న ఇంగ్లండ్.. లార్డ్స్‌లోనూ జోరు కొనసాగించింది. 389 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ బ్యాటింగ్ మరోసారి కుప్పకూలింది. షాద్ షకీల్ 97 పరుగులతో ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. ఓలీ రాబిన్సన్ (4-24), జోష్ టంగ్ (3-46), జోఫ్రా ఆర్చర్ (2-73) విజృంభించడంతో ఇంగ్లండ్ 194 పరుగుల భారీ తేడాతో విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో ఇంగ్లండ్ సిరీస్‌ను కైవసం చేసుకోగా.. పాకిస్థాన్‌కు మూడో టెస్టు నామమాత్రంగా మారింది. చివరి టెస్టు సెప్టెంబర్ 9న బర్మింగ్‌హమ్‌లో జరగనుంది. ఓవైపు వరుస ఓటములు.. మరోవైపు సీనియర్లపై వేటు.. ఇప్పుడు సెలెక్టర్ మిస్బా రాజీనామా.. వెరసి పాకిస్థాన్ క్రికెట్‌లో మరోసారి సంక్షోభ మేఘాలు కమ్ముకున్నాయి.

# టెన్నిస్ కోర్టే ఫ్యాషన్ ర్యాంప్!

- బాస్కెట్‌బాల్ దిగ్గజం లుక్‌లో ఒసాకా
- అలెన్ ఐవెర్సన్‌కు స్టయిల్‌తో నివాళి
- యూఎస్ ఓపెన్‌లో మరోసారి ప్రత్యేక ఆకర్షణ
- ఆటతో పాటు ఫ్యాషన్‌లోనూ తనదైన ముద్ర
- తొలి రౌండ్‌లో గెలిచి ముందంజ




**న్యూయార్క్:** టెన్నిస్ కోర్టులో ఆటతో ప్రత్యర్థులను హడలెత్తించడమే కాదు.. తన ఫ్యాషన్‌తో ప్రేక్షకులను అబ్బురపరచడం జపాన్ స్టార్ నవోమి ఒసాకాకు కొత్తేమీ కాదు. గ్రాండ్‌స్లామ్ టోర్నీ వచ్చిందంటే చాలు.. ఏదో ఒక ప్రత్యేక థీమ్‌తో కోర్టులోకి అడుగుపెట్టి అందరి దృష్టినీ ఆకర్షిస్తుంటుంది. తాజాగా యూఎస్ ఓపెన్-2026లోనూ అదే సంప్రదాయాన్ని కొనసాగించింది. ఈసారి అమెరికా బాస్కెట్‌బాల్ దిగ్గజం అలెన్ ఐవెర్సన్‌ను గుర్తుచేసే లుక్‌తో వచ్చి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్ కోసం ఒసాకా వినూత్న వేషధారణతో కోర్టులోకి వచ్చింది. పొడవాటి తెల్లని స్కర్ట్, వదులుగా ఉన్న హుడీతో ప్రవేశించిన ఆమె.. ఆ తర్వాత వాటిని తొలగించి ఐవెర్సన్‌ను తలపించే స్టయిల్‌లో కనిపించింది. జుట్టును 'కార్న్‌రోస్' తరహాలో తీర్చిదిద్దుకోవడంతో ఆమె లుక్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కోర్టులోకి వచ్చే ముందు ఐవెర్సన్ చిత్రం ముద్రించిన షర్ట్‌ను ధరించి అతడిపై తనకున్న అభిమానాన్ని చాటుకుంది. తన కొత్త లుక్‌పై ఒసాకా స్పందిస్తూ.. ఐవెర్సన్ ఆటతో పాటు అతడి ఫ్యాషన్ తనకు ఎంతో ఇష్టమని తెలిపింది. తనదైన స్టయిల్‌తో బాస్కెట్‌బాల్ ప్రపంచంలో ప్రత్యేక ముద్ర వేసిన ఐవెర్సన్.. క్రీడాకారుల దుస్తుల తీరుపైనా ప్రభావం చూపాడని పేర్కొంది. 'ఫ్యాషన్‌తోనూ మన వ్యక్తిత్వాన్ని చెప్పొచ్చు' అన్న భావనను ఒసాకా వ్యక్తం చేసింది. తనను అనుకరిస్తూ ప్రత్యేక లుక్‌లో కోర్టులోకి వచ్చిన ఒసాకాపై ఐవెర్సన్ కూడా ప్రశంసలు కురిపించాడు. తనకు దక్కిన గొప్ప గౌరవంగా దీనిని అభివర్ణిస్తూ ఆమెను ప్రత్యక్షంగా చూసేందుకు ఎదురుచూస్తున్నట్లు సందేశం పంపాడు. ఫ్యాషన్‌తోనే కాకుండా ఆటలోనూ ఒసాకా ఆకట్టుకుంది. తొలి రౌండ్‌లో జఖరోవాపై విజయం సాధించి రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. విభిన్న వేషధారణతో గ్రాండ్‌స్లామ్‌లలో సందడి చేయడం ఒసాకాకు అలవాటే. గత యూఎస్ ఓపెన్‌లో 'లబుబు' బొమ్మలతో ప్రత్యేకంగా కనిపించి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనూ ఆక్వా బ్లూ రంగు జాకెట్, వెడల్పాటి తెల్లని ప్యాంట్, తెల్లటి ముసుగు, టోపీ, చేతిలో గొడుగుతో ఫ్యాషన్ సుందరిలా కోర్టులోకి అడుగుపెట్టి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. రాకెట్‌తో ఆటలో తనదైన ముద్ర.. వేషధారణతో ఫ్యాషన్‌లో ప్రత్యేక ముద్ర.. రెండింటినీ కలిపి టెన్నిస్ కోర్టునే ఫ్యాషన్ వేదికగా మార్చేస్తోంది నవోమి ఒసాకా.

# పాటిదార్‌పై ఇషాన్ పైచేయి!

- దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్‌జోన్
- 4 వికెట్ల తేడాతో సెమీస్‌లో గెలుపు
- వైభవ్, ఇషాన్ మెరుపు బ్యాటింగ్
- ఏడు వికెట్లతో ముకేశ్ కుమార్ సత్తా
- దూబే తిప్పేసినా తప్పని ఓటమి



**బెంగళూరు:** దేశవాళీ సీజన్‌లో ప్రతిష్ఠాత్మక దులీప్ ట్రోఫీలో ఈస్ట్‌జోన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఇషాన్ కిషన్ సేన సెమీఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్‌ను నాలుగు వికెట్ల తేడాతో ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (40), కెప్టెన్ ఇషాన్ కిషన్ (39) బ్యాట్‌తో మెరవగా.. ముకేశ్ కుమార్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఏడు వికెట్లతో విజయంలో కీలకపాత్ర పోషించాడు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మైదానంలో జరిగిన సెమీఫైనల్లో తొలి ఇన్నింగ్స్‌లో రింకూ సింగ్ (60) అర్ధశతకంతో రాణించినా ప్రత్యర్థి జట్టు 266 పరుగులకే ఆలౌటైంది. అనంతరం హర్ష్ దూబే (4-66), ఆర్యన్ పాండే (3-43) బంతితో విజృంభించడంతో ఈస్ట్‌జోన్ కూడా సరిగ్గా 266 పరుగులకే కుప్పకూలింది. దీంతో తొలి ఇన్నింగ్స్ ముగిసేసరికి రెండు జట్లు సమానంగా నిలిచాయి.

### ముకేశ్ దెబ్బకు 158కే కుప్పకూలి..

రెండో ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు సాధించి ఈస్ట్‌జోన్‌కు సవాల్ విసరాలని భావించిన ప్రత్యర్థి జట్టుకు ముకేశ్ కుమార్, అభిజిత్ సర్కార్ షాకిచ్చారు. వీరిద్దరి ధాటికి బ్యాటింగ్ లైనప్ నిలవలేక 158 పరుగులకే ఆలౌటైంది. దీంతో ఈస్ట్‌జోన్ ముందు 159 పరుగుల లక్ష్యం నిలిచింది.

### వైభవ్ ధనాధన్.. ఇషాన్ దంచుడు

స్వల్ప లక్ష్య ఛేదనలో ఈస్ట్‌జోన్ ఓపెనర్లు అభిమన్యు ఈశ్వరన్ (24), వైభవ్ సూర్యవంశీ (40) దూకుడుగా ఆడి శుభారంభం అందించారు. ముఖ్యంగా వైభవ్ వేగంగా పరుగులు రాబట్టి ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచాడు. అయితే హర్ష్ దూబే మరోసారి బంతితో చెలరేగి 53 పరుగులకు నాలుగు వికెట్లు పడగొట్టడంతో ఈస్ట్‌జోన్ కాస్త తడబడింది. అయితే గాయం కారణంగా రెండో రోజు ఆటకు దూరమైన కెప్టెన్ ఇషాన్ కిషన్ కీలక సమయంలో బాధ్యత తీసుకున్నాడు. 39 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడి జట్టును విజయానికి చేరువ చేశాడు. చివర్లో మహమ్మద్ షమీ విన్నింగ్ షాట్ కొట్టడంతో ఈస్ట్‌జోన్ నాలుగు వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుని ఫైనల్లో అడుగుపెట్టింది. దూబే రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ బంతితో పోరాడినా.. వైభవ్ దూకుడు, ఇషాన్ కీలక ఇన్నింగ్స్, ముకేశ్ కుమార్ బౌలింగ్ జోరుతో ఈస్ట్‌జోన్ ఫైనల్ బెర్తును ఖాయం చేసుకుంది.



# అన్ని ఫార్మాట్ల పేసర్‌గా ఎదగాలి

## అదే నా లక్ష్యం: గుర్నూర్ బ్రార్

**బెంగళూరు:** మూడు ఫార్మాట్లలోనూ సత్తా చాటగల పేసర్‌గా ఎదగడమే తన ప్రధాన లక్ష్యమని భారత యువ ఫాస్ట్ బౌలర్ గుర్నూర్ బ్రార్ తెలిపాడు. సీనియర్ పేసర్లు జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణలతో కలిసి బౌలింగ్ చేయడం తనకు ఎంతో ఉపయోగపడిందని చెప్పాడు. ముఖ్యంగా బంతిని సరైన లెంగ్త్‌లో వేయడంలో స్థిరత్వం సాధించేందుకు వారి నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నట్లు పేర్కొన్నాడు. ఇప్పటివరకు భారత్ తరఫున ఆరు వన్డేలు ఆడిన గుర్నూర్ 6.96 ఎకానమీతో 11 వికెట్లు పడగొట్టి అంతర్జాతీయ కెరీర్‌కు మంచి ఆరంభం ఇచ్చాడు. రంజీ ట్రోఫీ, ఇండియా 'ఎ' తరఫున కనబరిచిన ప్రదర్శనతోనే భారత జట్టులో అవకాశం దక్కిందని తెలిపాడు. "బౌలింగ్‌లో లెంగ్త్‌ను నిలకడగా కొనసాగించడం, పిచ్ పరిస్థితులకు అనుగుణంగా ఒక్కో బ్యాటర్‌కు ఎలా బౌలింగ్ చేయాలన్న అంశాలపై మరింత అవగాహన పెంచుకుంటున్నా. ఎన్ని ఓవర్లు వేసినా శరీరంపై ఎక్కువ ప్రభావం పడకుండా ఫిట్‌నెస్‌ను తీర్చిదిద్దుకోవాలన్నది మొదటి నుంచీ నా లక్ష్యం" అని గుర్నూర్ చెప్పాడు. బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఇచ్చిన సలహాలతో తన బౌలింగ్‌లో గణనీయమైన మార్పు వచ్చిందన్నాడు. "బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణల బౌలింగ్‌ను దగ్గరగా పరిశీలించా. వారి నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నా. వారిలాగే అన్ని ఫార్మాట్లలో రాణించే పేసర్‌గా ఎదగడానికి ప్రయత్నిస్తున్నా" అని పేర్కొన్నాడు. ప్రస్తుతం దులీప్ ట్రోఫీలో నార్త్‌జోన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న గుర్నూర్ బ్రార్.. సౌత్‌జోన్‌తో జరిగిన సెమీఫైనల్ తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు పడగొట్టి మరోసారి తన సత్తా చాటాడు.

# ఆఫ్ఘన్‌తో టీ20 పోరుకు టీమిండియా రెడీ

- కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్
- వైస్ కెప్టెన్‌గా తిలక్ వర్మ
- వైభవ్ సూర్యవంశీకి జట్టులో చోటు
- బుమ్రా పునరాగమనం
- సెప్టెంబర్ 13 నుంచి మూడు మ్యాచ్‌ల సిరీస్



**న్యూఢిల్లీ:** ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును పురుషుల సెలక్షన్ కమిటీ ప్రకటించింది. ఈ సిరీస్‌లో టీమిండియాకు శ్రేయాస్ అయ్యర్ నాయకత్వం వహించనుండగా.. హైదరాబాదీ యువ బ్యాటర్ తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. జట్టులో సీనియర్లతో పాటు యువ ఆటగాళ్లకు సెలక్టర్లు ప్రాధాన్యం ఇచ్చారు. బ్యాటింగ్ విభాగంలో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి అవకాశం దక్కింది. అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ కూడా జట్టులో చోటు సంపాదించారు. సంజూ, ఇషాన్ వికెట్ కీపర్లుగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఆల్‌రౌండర్ల కోటాలో శివమ్ దూబే, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌లకు అవకాశం లభించింది. స్పిన్ బాధ్యతలను వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్ పంచుకోనున్నారు.

### బుమ్రా పునరాగమనం

పేస్ విభాగంలో స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి రావడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అతడితో పాటు అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా పేస్ బాధ్యతలు చేపట్టనున్నారు. అయితే బుమ్రా, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణాల ఎంపిక ఫిట్‌నెస్ క్లియరెన్స్‌కు లోబడి ఉంటుందని సెలక్షన్ కమిటీ తెలిపింది.

### సెప్టెంబర్ 13 నుంచి సమరం

ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో 3 టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. యువ ఆటగాళ్లకు అవకాశమిస్తూ, అనుభవజ్ఞులను జోడించి ఎంపిక చేసిన భారత జట్టు ఆఫ్ఘనిస్తాన్‌తో పోరుకు సిద్ధమవుతోంది. భారత జట్టు: శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, శివమ్ దూబే, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా.

# మూడు సినిమాలతో మమిత బైజు హ్యాట్రిక్

'ప్రేమలు'తో ఒక్కసారిగా యూత్ క్రష్‌గా మారిన మమితా బైజు .. ఇప్పుడు ఇండస్ట్రీలో క్రేజీ హీరోయిన్‌గా మారింది. తన క్యూట్‌నెస్‌తో కట్టిపడేసే ఈ మలయాళ ముద్దుగుమ్మ.. తాజాగా భారతీయ సినీ చరిత్రలోనే ఎవరూ సాధించని ఒక అరుదైన మైలురాయి చేరుకుంది. కేవలం 29 రోజుల వ్యవధిలో ఈ అమ్మడు నటించిన మూడు సినిమాలు వరుసగా రూ.200 కోట్లకుపైగా వసూలు చేసి.. హ్యాట్రిక్ కొట్టిన తొలి భారతీయ నటిగా చరిత్ర సృష్టించింది. ఎన్నో వాయిదాల తర్వాత జులై 23న వచ్చిన 'జననాయగన్' విజయాన్ని అందుకుంది. విజయ్ నటించిన చివరి చిత్రం కావడంతో భారీ అంచనాలు ఉండడంతో బాక్సాఫీస్ వద్ద ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. ఇందులో మమిత.. విజ్జి పాత్రలో ఆకట్టుకుంది. సూర్య కథానాయకుడిగా విశ్వనాథ్ అండ్ సన్స్..: భారీ చిత్రం విడుదలైన కొద్దిరోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.240 కోట్ల గ్రాస్‌తో ఘన విజయం సాధించింది. ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాలో మమిత నటన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అల్లరి చేసే పిల్లగా ఆకట్టుకున్న ఆమె.. అమ్మగానూ హృదయానికి హత్తుకునే నటనతో మెప్పించింది. బెత్లెహోమ్ కుటుంబ యూనిట్..: నివిన్ పౌలీతో కలిసి మమిత నటించిన ఈ మలయాళ చిత్రం ఆగస్టు 21న విడుదలై సంచలనం విజయం అందుకుంది. ఇప్పటికే రూ.200 కోట్ల మార్క్ దాటి రూ.250 కోట్ల దిశగా దూసుకుపోతోంది. దీన్నే తెలుగులో సెప్టెంబరు 4న విడుదల చేయనున్నారు.







# నవంబర్ 27న మైసా విడుదల

## రిలీజ్ డేట్ ప్రకటించిన మేకర్స్

కథానాయిక రష్మిక ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' రవీంద్ర పుల్లె తెరకెక్కిస్తున్నారు. తాజాగా చిత్రబృందం ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేసింది. ఈ చిత్రాన్ని నవంబరు 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ రిలీజ్ డేట్ ప్రకటన సందర్భంగా మేకర్స్ పంచుకున్న క్యాప్షన్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. సహజంగానే ఆమె దృఢమైనది.. ఎంచుకున్న మార్గంలో భయం లేనిది.. చెక్కుచెదరని ఆత్మవిశ్వాసం ఆమె సొంతం. మునుపెన్నడూ చూడని విధంగా 'మైసా' ప్రపంచంలో రష్మికను చూసేందుకు సిద్ధంగా ఉండండి అంటూ చిత్ర బృందం సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. మునుపెన్నడూ లేని విధంగా రష్మిక ఈ సినిమాలో పూర్తిస్థాయి యాక్షన్ పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి. రష్మిక కథానాయిక. పెళ్లి తర్వాత వీళ్లిద్దరూ కలిసి నటిస్తున్న చిత్రమిది. దసరా కానుకగా అక్టోబరు 16న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ఇటీవలే చిత్ర బృందం స్పష్టం చేసింది.




# కరీనా కపూర్ క్రైమ్ థ్రిల్లర్ 'దయారా'

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనా కపూర్ ఖాన్ మరియు టాలెంటెడ్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా క్రైమ్ థ్రిల్లర్ 'దయారా'. ప్రముఖ దర్శకురాలు మేఘనా గుల్జార్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ చిత్రంలో కరీనా కపూర్ ఖాన్ డీసీపీ అజూని కోహ్లీగా, పృథ్వీరాజ్ సుకుమారన్ డీసీపీ రామన్ కుమార్‌గా ప్రత్యర్థి పోలీసు అధికారులుగా కనిపించనున్నారు. చట్టం వర్సెస్ న్యాయం, నకిలీ ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ అయిన రామన్ కుమార్‌పై మరో పోలీసు అధికారి అజూని కోహ్లీ దర్యాప్తు చేసే తీవ్రమైన సన్నివేశాలతో ట్రైలర్ ఎంతో ఆసక్తికరంగా సాగింది. జంగ్లీ పిక్చర్స్, పెన్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాను మేఘనా గుల్జార్ యదార్థ ఘటనల ఆధారిత సీరియస్ డ్రామాగా మలిచారు. సస్పెన్స్ మరియు హై-వోల్టేజ్ డ్రామాతో కూడిన ఈ క్రైమ్ థ్రిల్లర్ ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 18న విడుదల కానుండగా, ప్రస్తుతం ఈ ట్రైలర్ సినీ వర్గాల్లో భారీ అంచనాలను పెంచేసింది.




# టాక్సిక్‌కు హాఫ్ స్టార్ రేటింగ్

### లెటర్ బాక్స్‌లో మహేశ్ బాబు తనయుడు గౌతమ్

### టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు కుమారుడు గౌతమ్ ప్రముఖ సోషల్ మీడియా రేటింగ్ యాప్

లెటర్‌బాక్స్ ద్వారా ఇచ్చిన సినిమా రేటింగ్‌లు ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. యశ్ హీరోగా నటించిన 'టాక్సిక్' సినిమాకు గౌతమ్ కేవలం హాఫ్ స్టార్ (0.5) ఇవ్వడం, అలాగే తన తండ్రి మహేష్ బాబు సినిమాలకే కాకుండా ఇతర స్టార్ హీరోల చిత్రాలకు ఇచ్చిన రేటింగ్‌లు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. గౌతమ్ లెటర్‌బాక్స్ ప్రొఫైల్ ప్రకారం.. అతను ఇప్పటివరకు వివిధ భాషలు మరియు జోనర్లకు చెందిన 400లకు పైగా సినిమాలను వీక్షించినట్లు తెలుస్తోంది. అయితే ఇతరులతో సంబంధం లేకుండా, సినిమాల కంటెంట్‌ను బట్టి స్వతంత్రంగా రేటింగ్‌లు ఇవ్వడం ఈ డిబేట్‌కు ప్రధాన కారణమైంది. తన తండ్రి మహేష్ బాబు నటించిన కల్ట్ క్లాసిక్స్ 'పోకిరి', '1: నేనొక్కడినే' సినిమాలకు గౌతమ్ 5 నక్షత్రాల రేటింగ్ ఇవ్వగా, 'బ్రహ్మోత్సవం' చిత్రానికి కేవలం 1 స్టార్ మాత్రమే ఇచ్చాడు. అలాగే 'నిజం', 'వంశీ' చిత్రాలకు 2 చొప్పున రేటింగ్ ఇచ్చాడు. కేవలం టాలీవుడ్ మాత్రమే కాకుండా పాన్-ఇండియా, హాలీవుడ్ సినిమాలపై కూడా గౌతమ్ తన అభిప్రాయాలను పంచుకున్నాడు. 'బాహుబలి 2' చిత్రానికి 5 స్టార్లు ఇవ్వగా, 'పెళ్లిచూపులు', 'సీతారామం' సినిమాలకు 4.5 రేటింగ్ ఇచ్చాడు. మరోవైపు, యశ్ 'టాక్సిక్' చిత్రంతో పాటు విజయ్ దేవరకొండ 'లైగర్' మూవీకి కూడా అర నక్షత్రం రేటింగ్ ఇవ్వడం విశేషం. ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి 2.5 రేటింగ్ ఇచ్చాడు. ఇక సినిమా కుటుంబానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ, బంధుప్రీతికి తావు ఇవ్వకుండా సినిమాలోని కంటెంట్ ఆధారంగా నిజాయితీగా రేటింగ్‌లు ఇస్తున్నాడని కొందరు నెటిజన్లు గౌతమ్‌ను ప్రశంసిస్తుంటే, మరికొందరు సెలబ్రిటీ కుటుంబాల నుంచి ఇలాంటి బహిరంగ రేటింగ్‌లు రావడం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. సెలబ్రిటీల పిల్లలు అయినంత మాత్రాన వారి వ్యక్తిగత అభిప్రాయాలు, సినిమా రుచి ఇతరులలాగే ఉండటంలో తప్పులేదని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNIVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **7036644111, 9490140565**

# యాదవుల ఐక్యతకు శ్రీకృష్ణ జన్మాష్ట మి వేదిక కావాలి...

- మన సంస్కృతి.. మన గౌరవం.. మన ఐక్యత
- సంస్కృతి నుంచి చైతన్యం వరకు.. యాదవుల ఐక్య ప్రస్థా నం
- వాడవాడలా జన్మాష్ట మి వేడుకలు ఘనంగా నిర్వహించాలి... జక్కుల రవీందర్ యాదవ్
- పాకాలలో ఉమ్మడి వరంగల్ జిల్లా యాదవుల ఆత్మీయ సమావేశం... ఆబోతు రాజు యాదవ్



**నర్సంపేట, సెప్టెంబర్ 1 (సమయం న్యూస్) :** ఉమ్మడి వరంగల్ జిల్లా యాదవుల ఆత్మీయ సమావేశం మంగళవారం పాకాలలో ఘనంగా నిర్వహించారు. నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్, అఖిల భారత యాదవ మహాసభ యువజన విభాగం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆబోతు రాజు యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర నాయకులు, కాజీపేట 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జక్కుల రవీందర్ యాదవ్ మాట్లాడుతూ సెప్టెంబర్ 4న నిర్వహించనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను వాడవాడలా, గ్రామగ్రామాన యాదవ సోదరులందరినీ కలుపుకొని ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. యాదవుల ఐక్యతా భావాన్ని మరింత బలోపేతం చేసుకోవడంతో పాటు తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. యాదవుల ఐక్యతే భవిష్యత్ రాజకీయ చైతన్యానికి బలమైన పునాది అని పేర్కొన్నారు. సామాజికంగా, రాజకీయంగా యాదవులు మరింత చైతన్యవంతులై తమ హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా భారీగా నిర్వహించనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు యాదవ సోదరులు, సోదరీమణులు కుటుంబ సమేతంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, మాజీ కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ సారథ్యంలో నిర్వహించనున్న ఈ వేడుకలకు రాష్ట్ర నలుమూలల నుంచి యాదవ ప్రజాప్రతినిధులు, మేధావులు, ఉద్యోగులు, యువతతో పాటు బీసీ, బహుజన వర్గాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ ఆత్మీయ సమావేశంలో షాన్ మూవీ హీరో బూస కుమార్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బుట్టి శ్యామ్ యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ ఉమ్మడి జిల్లా నాయకులు పిండి రవి యాదవ్, వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దొంగల చెన్నమల్లు యాదవ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నించే గొంతుక రాహుల్.. అండగా యావత్ కాంగ్రెస్

- వ్యక్తుల కోసం కాదు.. ప్రజాస్వామ్యం కోసం కాంగ్రెస్ పోరాటం
- రాహుల్ గాంధీపై కేసులు వెంటనే ఎత్తివేయాలి
- బేషరతుగా క్షమాపణ చెప్పాలి... డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్



**వరంగల్, సెప్టెంబర్ 1 (సమయం న్యూస్) :** ప్రజాస్వామ్య స్వరాన్ని అణచివేసే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ సహించబోదని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై రాజకీయ కక్షతో అక్రమ కేసులు నమోదు చేయడం సరికాదని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీపై కేసులు పెట్టినందుకు కాంగ్రెస్ పార్టీకి బీజేపీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని కోరారు. ఉత్తరప్రదేశ్‌లో రాహుల్ గాంధీపై కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ టీపీసీసీ ఆదేశాల మేరకు మంగళవారం వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వెంక ట్రామ జంక్షన్ వద్ద భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రాహుల్ గాంధీకి మద్దతుగా నినాదాలు చేశారు. అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రజల తరఫున ప్రశ్నిస్తున్నారని, ప్రజల హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్యం కోసం నిరంతరం పోరాడుతున్నారని అన్నారు. ప్రశ్నించే గొంతును కేసులతో అణచివేయాలని చూస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ దేశ ప్రజల సమస్యలను పార్లమెంట్‌లో, ప్రజాక్షేత్రంలో బలంగా వినిపిస్తున్నారని అన్నారు. రైతులు, యువత, మహిళలు, పేదలు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన నిరంతరం పోరాడుతున్నారని పేర్కొన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక కేసుల పేరుతో రాహుల్ గాంధీ గొంతును నొక్కాలని చూడటం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని అయూబ్ అన్నారు. రాహుల్ గాంధీపై ఎన్ని కేసులు పెట్టినా ఆయన ప్రజా పోరాటాన్ని ఆపలేరని, దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆయనకు అండగా నిలుస్తాయని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి ప్రశ్నించే హక్కు ఉందని, ఆ హక్కును ప్రభుత్వాలు గౌరవించాలని అన్నారు. అధికారంలో ఉన్న వారు విమర్శలను స్వీకరించి ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలే తప్ప, ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచకూడదని సూచించారు. కాంగ్రెస్ పార్టీ పోరాటం వ్యక్తుల కోసం కాదు.. ప్రజాస్వామ్యం కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం, ప్రజల హక్కుల కోసం. రాహుల్ గాంధీ వెంట కాంగ్రెస్ పార్టీ బలంగా నిలుస్తుందని అయూబ్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు ధోరణిని విడనాడాలని, రాహుల్ గాంధీపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలిగించే చర్యలను కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య పద్ధతుల్లో తీవ్రంగా ప్రతిఘటిస్తుందని, ప్రజల పక్షాన పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ సంఘ్ వెంకటరాజ్యం, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేష్, మాజీ కార్పొరేటర్ గుండేటి నరేందర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు నల్గొండ రమేష్, వర్ధన్నపేట మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న, వర్ధన్నపేట టౌన్ అధ్యక్షుడు ఈగ దామోదర్, 3, 14, 43వ డివిజన్ల అధ్యక్షులు జన్ను అరుణకర్, సయ్యద్ ఇంతియాజ్, మాడుగుల రాజుకుమార్, మాజీ మండల అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్, ఎద్దు సత్యం, ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల, యూత్, మహిళా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్ నాయకులు, మండల, టౌన్, డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీజేపీ కార్యాలయాలపై దాడులను నిరసిస్తూ ఆందోళన

**ఆలేరు, సెప్టెంబరు 1(సమయం న్యూస్):** బీజేపీ రాష్ట్ర కార్యాలయం, నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నివాసంపై జరిగిన దాడులను నిరసిస్తూ ఆలేరు పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన నిర్వహించారు. పట్టణ జనరల్ సెక్రటరీ ఎలగల వెంకటేష్ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ సమీపంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి, రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై, నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఇంటిపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండించారు. రాజకీయ పార్టీల కార్యాలయాలు, నాయకుల ఇళ్లపై దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య పద్ధతి కాదని పేర్కొన్నారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దిష్టిబొమ్మల దహనం అనంతరం పోలీసులు బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు గుర్రం నరసింహులు, పేరపు ఆనంద్, బీజేవైఎం జిల్లా నాయకులు శాంతిరెడ్డి, బందేల విష్ణు, కాంద్ర శీను, పేరపు శివ, శ్రావణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటలో గెలుపు ఒక్కటే కాదు.. జీవితానికి ఎన్నో పాఠాలు

- ఇంటర్ కంపెనీ స్పోర్ట్స్ మీట్ ప్రారంభించిన ఎమ్మెల్యే 'కేఆర్ నాగరాజు'
- క్రీడలతో శారీరక దృఢత్వం.. మానసిక ధైర్యం
- క్రీడా స్ఫూర్తితో కర్తవ్య నిర్వహణలో మరింత రాణించాలి
- పోలీసు మైదానం ఇచ్చిన స్ఫూర్తి.. ప్రజాసేవకు పునాది...



**వరంగల్, సెప్టెంబర్ 1 (సమయం న్యూస్) :** క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. మామునూరు 4వ బెటాలియన్ టీజీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్ కంపెనీ స్పోర్ట్స్ మీట్‌ను మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. క్రీడలు పోలీస్ సిబ్బందిలో ఒత్తిడిని తగ్గించి మానసిక ప్రశాంతతను, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని నాగరాజు పేర్కొన్నారు. విధి నిర్వహణలో నిరంతరం ఒత్తిడితో పనిచేసే పోలీసులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని తెలిపారు. క్రీడలు ఒక రకమైన ధ్యానం వంటివని, ఒత్తిడిని తగ్గించడంతో పాటు ఆరోగ్యం, పనితీరును మెరుగుపరుస్తాయని అన్నారు. క్రీడలు కేవలం గెలుపు, ఓటములకు సంబంధించినవి కావని, క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల, ఆత్మవిశ్వాసం, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. పోలీస్ శాఖలో క్రమశిక్షణ, అంకితభావం, ధైర్యసాహసాలకు ప్రత్యేక గుర్తింపు ఉందని, అలాంటి లక్షణాలను మరింత బలోపేతం చేసేలా క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తాను చిన్నతనంలో ఇదే క్రీడా మైదానంలో పోలీసులను చూసి స్ఫూర్తి పొందానని, ఆ స్ఫూర్తితో పోలీస్ కమిషనర్ స్థాయి వరకు ఎదిగి, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందని నాగరాజు గుర్తుచేశారు. పోలీస్ కుటుంబాల్లో ఏవైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. ఆత్మహత్యలు ఏ సమస్యకూ పరిష్కారం కావని, సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని పరిష్కరించుకోవాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. అనంతరం పోలీస్ అధికారులతో కలిసి బెటాలియన్ గ్రౌండ్‌లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ ఎన్వీ సత్య శ్రీనివాస్ రావు, అసిస్టెంట్ కమాండెంట్లు రాజేందర్, బాలయ్య, డివిజన్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ అరుణ విట్టల్, మాజీ డివిజన్ అధ్యక్షుడు చింత ప్రకాష్, సీనియర్ నాయకులు బాబురావు, కొమురెల్లి యాదవ్, శివకుమార్, వాడేపల్లి ప్రకాష్, అరుణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

## సెప్టెంబరు 2 నుంచి బీఆర్ ఎస్ పోరుబాట: భిక్షమయ్యగౌడ్



**ఆలేరు, సెప్టెంబరు 1(సమయం న్యూస్):** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ విమర్శించారు. మంగళవారం ఆలేరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహిళలకు నెలకు రూ.2,500, రైతు కూలీలకు రూ.12,500, పింఛన్ల పెంపు, రైతు రుణమాఫీ తదితర హామీలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. యూరియా, డీఏపీ కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆలేరు నియోజకవర్గంలో సాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల ద్వారా నీరు అందించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ సాగునీటి పనులు పూర్తి చేయాలని కోరారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సెప్టెంబరు 2 నుంచి వారం రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# విద్యార్థి ని,విద్యార్థు లకు అవగాహన కల్పించిన పరిగి "షీ" టీమ్ పోలీసులు

## జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా( IPS) మరియు పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఆదేశానుసారం



**కుల్కచర్ల మండలం, సెప్టెంబర్,01(సమయం న్యూస్)**

వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గ పరిధి లోని కుల్కచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని జెడ్పిహెచ్ఎస్ సాలవిడ్ స్కూల్ లో పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సిములు విద్యార్థినీ, విద్యార్థులకు కుల్కచర్ల ఎస్సై రమేష్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.మహిళ పై జరుగుతున్న నేరాలు.నిర్భయ చట్టం, POCSO Act గురించి.112డయాల్, "షీ" టీమ్ నం -181. సీసీ కేమెరాలు.బాల్య వివాహాలు.బాల కార్మిక వ్యవస్థ.కమ్యూనిటీ పోలిసింగ్.మానవ అక్రమ రవాణా.మద్యపాన నిషేధం.బ్యాంకింగ్ ఆన్లైన్ మోసాలు.గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం.Cyber crimes No:1930 పై అవగాహన.వివిధ అంశాలపై విద్యార్థిని లకు అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో వికారాబాద్ కళాబృందం ఇంచార్జి అశోక్, హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు కె. రాంచందర్, అధ్యాపక బృందం,విద్యార్థులు, విద్యార్థినిలు,మరియు "షీ" టీమ్ సభ్యులు శోభ,పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు: ఎస్పీ డాక్ట ర్ వినీత్ ఐపీఎస్

- ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు,బహిరంగ కార్యక్రమాలు, సభలు జిల్లాలో నిషేధం.



**నారాయ ణ పేట , సెప్టెంబర్,01(సమయం న్యూస్)** శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఈ నెల రోజుల పాటు "30 పోలీస్ ఆక్ట్" అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... 30 పోలీస్ ఆక్ట్ సెప్టెంబర్ 30వ తేది వరకు అమల్లో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు,ఊరేగింపులు, ధర్నాలు వంటి కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమ్మిగుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు. నిషేధం లో ఉన్న నిబంధనలు తప్పని సరిగా అందరూ పాటించాలని ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తు దరఖాస్తు చేసుకునీ అనుమతులు తీసుకోవాలని ఎస్పి కోరారు.

# పాఠశాలల్లో విద్యా ప్రమాణాలపై డీఈఓ పరిశీలన

**ఆలేరు, సెప్టెంబరు 1:** ఆలేరు మండలం కొల్లూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి మంగళవారం సందర్శించారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్యా సదుపాయాలు, బోధన తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, నిర్వహణ తీరును తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల రైటింగ్ స్కిల్స్‌ను పరిశీలించి వారి అభ్యసన స్థాయిని అంచనా వేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న డాక్టర్.ఉమామహేశ్వరి కి సన్మానం.



**వలిగొండ సెప్టెంబర్ 01 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మూడు సంవత్సరాల నుండి వైద్య ఆరోగ్యలో సేవలు చేసుకుంటూ ప్రమోషన్ పై బదిలీపై వెళ్తున్న డాక్టర్ ఉమామహేశ్వరి కి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వేములకొండ డిపార్ట్మెంట్ తరఫున శాలువాతో సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ వేణు మాధవి ఆయుర్వేద డాక్టర్ అర్చన పి హెచ్ ఎన్ అనురాధ హెచ్ ఈ ఓ రమేష్ సూపర్వైజర్ రేణుకా దేవి స్టాఫ్ నర్స్ అనిత ఫార్మసిస్ట్ సునీత కొండల్ సతీష్ జానకి రాములు జడిగే సత్తయ్య శోభారాణి ఏఎన్ఎంలు సంధ్యారాణి సరళ వినోద అనిత ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమం



**వలిగొండ సెప్టెంబర్ 01 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిషత్ కార్యాలయం వలిగొండ లో గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (జి పి ఎస్ ఏ పి)పై మండల స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి పర్యవేక్షణలో ఈ వర్క్‌షాప్ నిర్వహించబడింది. ఈ సందర్భంగా మండల పరిధిలోని గ్రామ పంచాయతీలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని పంచాయతీ కార్యదర్శుల నుంచి సేకరించి, (జి పి ఎస్ ఏ పి) ప్రణాళికలో పొందుపరిచే సమాచారాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు మండల స్థాయిలో గ్రామ పంచాయతీలను నాలుగు గ్రూపులుగా విభజించి, సంబంధిత అధికారుల సమన్వయంతో ప్రణాళిక తయారీ ప్రక్రియను చేపట్టారు. ఈ కార్యక్రమంలో యం.పి.డి.ఓ, ఏ.ఈ. ఈ. ఏ.పి.ఓ, ఏ.పి.యం, ఏ.ఈ. ఈ. ఆర్.డబ్లు.ఎస్.ల ఆధ్వర్యంలో సంబంధిత శాఖల నుంచి అందిన సమాచారాన్ని పూర్తిస్థాయిలో వెరిఫికేషన్ చేయడం జరిగింది.

## సీపీఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలి

- **బకాయి డీఏలతో తెలంగాణ 2వ పీఆర్సీ ప్రకటించాలి**
- **పెన్షన్ ఉద్యోగి హక్కు సెప్టెంబరులోగా సీపీఎస్ కు చరమగీతం పలకాలి: ఉద్యోగ సంఘాల నేతలు**



**ఆలేరు, సెప్టెంబరు 1(సమయం న్యూస్):** కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆలేరు మండల ఉద్యోగుల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా మంగళవారం ఆలేరు మండల కేంద్రంలో పాఠశాల ఉద్యోగుల బృందం నిరసన కార్యక్రమం నిర్వహించింది. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయంలో గ్రామ పరిపాలనాధికారి సత్తిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పసుపులేటి నరేంద్రస్వామి, రిటైర్డ్ ఉద్యోగుల తరఫున పూల నాగయ్య, మాజీ డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వర్లు , గుండు జగన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయి డీఏలను వెంటనే చెల్లించడంతో పాటు తెలంగాణ 2వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ)ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెన్షన్ ఉద్యోగి హక్కు దశాబ్దాల పాటు ప్రభుత్వ సేవలో పనిచేసి, తన జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేసిన ఉద్యోగికి పదవీ విరమణ అనంతరం భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని నాయకులు అన్నారు. పాత పెన్షన్ విధానానికి బదులుగా సీపీఎస్ పేరుతో ఉద్యోగుల భవిష్యత్తును మార్కెట్ పరిస్థితులకు ముడిపెట్టడం వల్ల రిటైర్ అయిన ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సీపీఎస్ అమలులోకి వచ్చి సుమారు రెండు దశాబ్దాలు గడిచినా ఉద్యోగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికే పదవీ విరమణ చేసిన సీపీఎస్ ఉద్యోగుల పరిస్థితిని ప్రభుత్వం పరిశీలించి, వారి జీవితాలకు భరోసా కల్పించాలని కోరారు. ప్రజా ప్రభుత్వంలో కీలక మార్పు కావాలి. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడం ప్రజా ప్రభుత్వంలో జరిగే కీలక మార్పుల్లో ఒకటిగా ఉండాలని నాయకులు అన్నారు. ఉద్యోగులు, ప్రభుత్వం వేర్వేరు కాదని.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజా కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అమలు చేసేది ఉద్యోగులేనని గుర్తుచేశారు. అలాంటి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం జాప్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎస్ రద్దు కోసం ఉద్యోగులందరూ ఐక్యంగా ఉద్యమిస్తున్నారని, వచ్చే సెప్టెంబరులోగా సీపీఎస్‌కు చరమగీతం పాడి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి అని నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# దళితుడి ఆత్మగౌరవంపై దాడి.. రాహుల్ ప్రశ్నిస్తే ఎఫ్ఐఆర్

- **అంబేద్కర్ రాజ్యాంగంలో అంటరానితనానికి చోటెక్కడిది?**
- **'దరో మత్' స్ఫూర్తితో.. మహిళా కాంగ్రెస్ సమరశంఖం**
- **భయపెట్టాలని చూస్తే.. పోరాటం మరింత ఉధృతం...ఎర్రబెల్లి స్వర్ణ**




**హన్మకొండ, సెప్టెంబర్ 1 (సమయం న్యూస్) :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఉత్తరాఖండ్‌లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ డిమాండ్ చేశారు. హల్ద్వానీలో శుద్ధీకరణ పేరుతో దళితులను అవమానించిన బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని కోరారు. అఖిల భారత మహిళా కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు రాహుల్ గాంధీపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను ఖండిస్తూ, ఉత్తరాఖండ్‌లో బీజేపీ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం గాంధీ భవన్ నుంచి నిరసన ర్యాలీ చేపట్టారు. ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో గాంధీ భవన్ ఎదుట మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శాంతియుతంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హల్ద్వానీలో పాల్గొన్న బహిరంగ సభలో ఆయన కూర్చున్న ప్రదేశాన్ని బీజేపీ–ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు గంగాజలంతో శుద్ధి చేయడం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. "ఒక దళితుడు కూర్చుంటే ఆ ప్రదేశం అపవిత్రం అవుతుందా? ఇదేనా మీ హిందుత్వం? ఇదేనా మీ సంస్కారం?" అంటూ ప్రశ్నించారు. ఇది ఖర్గేను అవమానించడం మాత్రమే కాదని, భారత రాజ్యాంగాన్ని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను అవమానించడమేనని స్వర్ణ పేర్కొన్నారు. ఈ ఘటనను రాహుల్ గాంధీ ధైర్యంగా ప్రశ్నించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారని తెలిపారు. అయితే బాధ్యులపై చర్యలు తీసుకోకుండా, ప్రశ్నించిన రాహుల్ గాంధీపైనే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. "న్యాయం కోసం మాట్లాడిన నాయకుడిపై కేసు పెట్టడం ప్రజాస్వామ్యమా? ఇది నియంతృత్వం కాదా?" అని ప్రశ్నించారు. కులగణన, మహిళలకు రిజర్వేషన్లు, దేశ సంపదపై జరుగుతున్న దోపిడీ వంటి అంశాలపై రాహుల్ గాంధీ ప్రశ్నించిన ప్రతిసారీ కేసులు పెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. రాజ్యాంగం, సామాజిక న్యాయం, మహిళల ఆత్మగౌరవం కోసం రాహుల్ గాంధీ నిర్భయంగా నిలబడుతున్నారని అన్నారు. ఈ రోజు రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్.. రేపు ప్రశ్నించే ప్రతి ఒక్కరిపైనా ఎఫ్ఐఆర్. మమ్మల్ని భయపెట్టాలని చూస్తున్నారు. కానీ మేము భయపడం. 'దరో మత్' అనే రాహుల్ గాంధీ సందేశంతో పోరాటాన్ని కొనసాగిస్తామని ఎర్రబెల్లి స్వర్ణ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని, హల్ద్వానీ ఘటనకు బాధ్యులైన బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ తరఫున డిమాండ్ చేశారు. ఈ నిరసన ఇక్కడితో ఆగదని, ఇది ఆరంభం మాత్రమేనన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, దళితుల హక్కులు, మహిళల ఆత్మగౌరవం కోసం చివరి శ్వాస వరకు పోరాడుతామని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీజేపీ కార్యాలయంపై దాడి..

- **కాంగ్రెస్ గూండా రాజకీయాలకు పరాకాష్ట**
- **ఇదేనా కాంగ్రెస్ వీరత్వం**
- **పోలీసులు వేసుకున్నది కాకీ బట్ట లా? కాంగ్రెస్ బట్ట లా**
- **రామచంద్రరావును హౌస్ అరెస్ట్ చేయడం రేవంత్ రెడ్డి పిరికితనానికి నిదర్శనం..**
- **బీజేపీ కార్యకర్త ల ఓపికను పరీక్షించొద్దు**
- **పరిణామాలు తీవ్రంగా ఉంటాయి**
- **బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు**



**ఖమ్మం, సెప్టెంబర్ 1 : ( సమయం న్యూస్ )** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయాన్ని యూత్ కాంగ్రెస్ గూండాలు ముట్టడించి, దాడికి పాల్పడటాన్ని బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు మంగళ వారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. బిజెపి కార్యాలయంలో ఎవరూ లేని సమయంలో పిరికిపందల్లా గా వచ్చి దాడి చేయడం సిగ్గుచేటు, అమానుషం అని మండి పడ్డారు. రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము లేక ఇలా దాడులకు పాల్పడటం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అంటూ దుయ్యాబట్టారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటికీ తన పెయింటింగ్ వ్యాపారం బుద్ధి పోనిచ్చుకోలేదా? అని ప్రశ్నిస్తూ తమ యూత్ కాంగ్రెస్ గూండాలతో పెయింట్ పంపించి , బీజేపీ పార్టీ కార్యాలయం గేటుకు వేయించడం, ఆయన రాజకీయ పతనానికి ఆరంభం అని దేవకి వాసుదేవరావు తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**పోలీస్ శాఖ తీరుపై తీవ్ర ఆగ్రహం**

రాష్ట్ర పోలీస్ శాఖ వైకరి పట్ల హెచ్చరించారు మీరు కాకీ బట్టలు వేసుకున్నారా? కాంగ్రెస్ బట్టలు వేసుకున్నారో ఒక్కసారి ఆలోచించుకోండి. కాంగ్రెస్ పార్టీకి తొత్తులుగా, చెంచాగిరి చేయడం యావత్ పోలీస్ శాఖకే మచ్చ తెచ్చే విధంగా ఉంది అని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ గూండాలు వచ్చి మా కార్యాలయంపై దాడి చేస్తుంటే, దేశ ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం సిగ్గుచేటు తోపాటు బాధ్యతరాహిత్యం అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడాల్సిన హోంశాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇలాంటి ఘటనలకు అవకాశం ఎలా కల్పిస్తున్నారో సమాధానం చెప్పాలని దేవకి వాసుదేవరావు డిమాండ్ చేశారు.

**బీజేపీ కార్యకర్త ల సహనాన్ని పరీక్షించవద్దు**

కాంగ్రెస్ కార్యకర్తల్లా గా మా కార్యకర్తలు బీరు బిర్యానీ బ్యాచ్ కాదు బిడ్డా. మా కార్యకర్తల సహనాన్ని, ఓపికను పరీక్షించవద్దు. మేము రాజ్యాంగం, చట్టం పట్ల గౌరవం ఉన్నవాళ్ల ం.. కాబట్టి శాంతిభద్రతలకు భంగం కలగకూడదని సంయమనం పాటిస్తున్నాం. మా ఓపికను పరీక్షిస్తే రెట్టింపు స్థాయిలో ప్రజాస్వామ్య బద్ధంగా కార్యక్రమాలకు శ్రీకారం చుడతాం" అని హెచ్చరించారు.

**నల్లగొండ ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలి**

బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై జరిగిన దాడిని ఖండిస్తూ నల్ల గొండలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కాంగ్రెస్ కార్యాలయాన్ని ముట్టడించిన అనంతరం, రాజకీయంగా ఎదుర్కోలేక ఆయన కుటుంబ సభ్యులపై దాడికి ప్రయత్నించడం, ఇంట్లో సామాన్లు ధ్వంసం చేయడం దుర్మార్గమని అన్నారు. కాంగ్రెస్ గూండాల పై రౌడీషీట్ ఓపెన్ చేసి, పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రామచంద్రరావు హౌస్ అరెస్ట్ రేవంత్ రెడ్డి పిరికిపంద చర్య ఈ రోజు మా రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ను హౌస్ అరెస్ట్ చేయడం మీ చేతగానితనానికి నిదర్శనం. మీరు అంత పుడింగి అయితే మా రాష్ట్ర అధ్యక్షుడిని ఎందుకు హౌస్ అరెస్ట్ చేయాల్సి వచ్చింది?" అని దేవకి వాసుదేవరావు ప్రశ్నించారు. బిజెపి ఎలాంటి కార్యక్రమానికి పిలుపునివ్వకముందే ముందస్తు అరెస్టులు చేయడం ప్రభుత్వ పిరికితనానికి నిదర్శనమని తెలిపారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి తెలుసుకోండి. మేము రాజ్యాంగం పైన, చట్టం పైన గౌరవం ఉన్న వాళ్ల ం. శాంతిభద్రతలకు భంగం కలగకూడదని చాలా ఓపిక పడుతున్నాం. మా ఓపికను పరీక్షిస్తే రెట్టింపు కార్యక్రమాలకు శ్రీకారం చుడతాం" అని దేవకి వాసుదేవరావు హెచ్చరించారు.

# సర్పంచుల సమస్యలపై జేఏసీ పోరుబాట

- **పెండింగ్ నిధులు విడుదల చేయాలి: గ్రామ పంచాయతీల జనరల్ ఫండ్ పై ఫ్రీజింగ్ ఎత్తివేయాలి**
- **అన్ని గ్రామపంచాయతీలకు సమానంగా అభివృద్ధి నిధులు కేటాయించాలి**



**ఆలేరు, సెప్టెంబరు 1(సమయం న్యూస్):** గ్రామపంచాయతీలు, సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా సర్పంచ్ ఫోరం జేఏసీ నిర్ణయించింది. జిల్లా సర్పంచ్ ఫోరం జేఏసీ అధ్యక్షుడు జుకంటి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలేరు నియోజకవర్గ సర్పంచుల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ మండలాలకు సర్పంచుల జేఏసీ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో గ్రామపంచాయతీలకు రావాల్సిన నిధులు, సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా స్టేట్ ఫైనాన్స్ కమిషన్ (ఎస్ ఎఫ్ సి) నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ ప్రజల నుంచి వివిధ పనుల రూపంలో వసూలు చేసిన జనరల్ ఫండ్‌ను ఫ్రీజింగ్‌లో పెట్టడం వల్ల గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టలేని పరిస్థితి ఏర్పడిందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఫ్రీజింగ్‌ను తొలగించి, గ్రామపంచాయతీల నిధులను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

**అన్ని గ్రామాలకు సమాన నిధులు**

నియోజకవర్గంలోని అన్ని గ్రామపంచాయతీలను సమానంగా అభివృద్ధి చేసేందుకు స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎలాంటి పక్షపాతం లేకుండా అభివృద్ధి నిధులు కేటాయించాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రతి గ్రామానికి అవసరమైన మేరకు నిధులు అందితేనే మౌలిక వసతులు మెరుగుపడి ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామపంచాయతీలకు మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందకపోవడం, విద్యుత్ వోల్టేజ్ సమస్యలు తదితర కారణాలతో సర్పంచులపై అదనపు భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత స్థానిక సంస్థలపై ఉన్నప్పటికీ, తగిన నిధులు అందుబాటులో లేకపోవడం వల్ల సర్పంచులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. త్వరలో జిల్లా స్థాయి సభ జిల్లాలోని అన్ని మండలాల్లో సర్పంచుల జేఏసీ కమిటీలను త్వరలో ఏర్పాటు చేస్తామని నాయకులు తెలిపారు. అనంతరం జిల్లా స్థాయిలో భారీ సభ నిర్వహించి గ్రామపంచాయతీలు, సర్పంచుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమిస్తామని ప్రకటించారు. మండలాల వారీగా అధ్యక్షుల ఎన్నిక ఈ సందర్భంగా రాజాపేట మండల జేఏసీ అధ్యక్షుడిగా పల్లె సంతోష్ గౌడ్, యాదగిరిగుట్ట మండలానికి గౌడ మహేందర్, తుర్కపల్లి మండలానికి సీతరాజు, బొమ్మలరామారం మండలానికి గుడిమామిడి వెంకటేష్, గుండాల మండలానికి గడ్డమీది మహోదయ గౌడ్, ఆత్మకూర్ మండలానికి ఎర్ర సోమిరెడ్డి, మోటకొండూర్ మండలానికి బెల్లి మల్లేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్‌రెడ్డి, కూర వెంకటేష్, ఆయా మండలాల సర్పంచ్ ఫోరం జేఏసీ నాయకులు, ఆలేరు మండల సర్పంచులు ధూపాటి వెంకటేష్, పరిధి మమతా సంతోష్, నర్సయ్య, బేధారబోయిన యాకమ్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# జీవితానికి అర్థం పరమార్థం ఉండాలి



**ఖమ్మం, సెప్టెంబర్ 1 ( సమయం న్యూస్ )** : ప్రతి మనిషి జీవితానికి ఒక అర్థం పరమార్థం ఉండాలని పలువురు మహిళా వక్తలు ఉద్ఘాటించారు. జమాతే ఇస్లామీ హింద్ వెస్ట్ శాఖ ఆధ్వర్యంలో వెంకటేశ్వర నగర్ జమాత్ కార్యాలయంలో ప్రవక్త ముహమ్మద్ (స) జీవితం , బోధనలు అంశం పై మహిళా విద్యావేత్తల రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డా. రేహానా (ఐఎంఏ ప్రెసిడెంట్) మాట్లాడుతు మన జీవితానికి ఒక లక్ష్యం ఉండాలి, దేవుడు మనకి పుట్టించిన ఈ పుట్టుక సార్ధకం కావాలి అంటే ఈ జీవితాన్ని ఒక పరీక్ష లాగా భావించి 100% మార్కులు వచ్చే విధంగా బ్రతకాలని పేర్కొన్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ 48 డివిజన్ మాజీ కౌన్సిలర్ గోవిందమ్మ మాట్లాడుతు అందరికీ సాయం చేసి వారితో మంచిగా మెలిగే వారిని దేవుడు మెచ్చుకుంటాడు. హిందూ ముస్లిం భాయి భాయిగా మెలగాలి అని చెప్పారు. జాగృతి ఎన్జీవో మెంబర్ మాధవి మాట్లాడుతు తల్లిగా మన ప్రధాన బాధ్యత మనం మన పిల్లలకు మంచి సంస్కారాలు ఇస్తే మన దేశం ఇతర దేశాల కంటే ఉన్నతంగా ఎదుగుతుందని అన్నారు. జిల్లా మిషన్ కోఆర్డినేటర్ సమీన్ ప్రవక్త ను ఆదర్శంగా తీసుకొని మన జీవితాన్ని గడపాలి. ఆడవారు తమ హద్దుల్లో ఉండి ఎంత విజయాన్ని అయినా సాధించవచ్చు, సమాజం మారాలంటే ముందుగా మనం మారాలి అన్నారు. జమాతే ఇస్లామీ హింద్ నగర శాఖ అధ్యక్షురాలు అస్మా అంజుమ్ మాట్లాడుతు మానవాళిని సన్మార్గంలో నడిపించేందుకు ఎందరో ప్రవక్తలను అల్లాహ్ అవతరింపచేసాడు. వారిలో చివరి ప్రవక్త మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) అని అన్నారు. కొంతమంది భావిస్తున్నట్లు ఆ మహనీయుడు కొందరివారు కాదు, అందరివారు. మానవాళి మొత్తానికీ మార్గదర్శి అన్నారు. జమాతే ఇస్లామీ హింద్ పిఆర్ కన్వీనర్ హాజీరా మాట్లాడుతూ ఈనాడు మానవ సమాజం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు ప్రవక్త వారి ఉపదేశాల్లో పరిపూర్ణ పరిష్కారం ఉంది, మానవుంతా ఒక్కటే, అందరి దేవుడు ఒక్కడే అన్నది ఆయన ప్రధాన సంధేశం అన్నారు. షోబే అలిమత్ సభ్యురాలు ఖాసిమా షాహిన్ మాట్లాడుతూ తల్లిపాదాల క్రింద స్వర్గం ఉంది. ఆమెను ప్రేమించి, సేవించి మాత్రమే స్వర్గార్హత సాధించవచ్చని అన్నారు. తల్లిదండ్రులు తమ సంతానానికి ఉత్తమ విద్య నేర్పించాలని, నైతిక విలువలను ఉగ్గుపాలతో పోయాలని భావితరాల సంక్షేమానికి ఇది చాలా అవసరమని ప్రవక్త (స) నొక్కి చెప్పారన్నారు. వెస్ట్ ఉపాధ్యక్షురాలు నుస్రత్, నూర్జహాన్, ఆమెనా , సాజిదా . షాజియా , జబీన్ దిల్షాద్, ముంతాజ్ మహిళా విద్యావేత్తలు పాల్గొన్నారు

# రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

- **యువతలో ప్రగతిశీల భావాలను పెంపొందించడమే లక్ష్యం: సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్**

**ఆలేరు, సెప్టెంబర్ 1(సమయం న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో ఈనెల 8, 9, 10 తేదీల్లో యాదగిరిగుట్టలో నిర్వహించనున్న అఖిల భారత యువజన సమాఖ్య (ఏ ఐ వై ఎఫ్) రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ పిలుపునిచ్చారు. మహాసభల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆలేరు ప్రాంతంలో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చెక్క వెంకటేష్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువత పాత్ర అత్యంత కీలకమన్నారు. యువతలో ప్రగతిశీల, అభ్యుదయ భావాలతో పాటు దేశభక్తి, లౌకిక, ప్రజాస్వామిక ఆలోచనలు, నైతిక విలువలు, మానవత్వాన్ని పెంపొందించేందుకు ఫెడరేషన్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, సుభాష్ చంద్రబోస్ తదితరుల స్ఫూర్తితో యువత పెద్దఎత్తున ఉద్యమాల్లో పాల్గొన్న విషయాన్ని గుర్తుచేశారు. దేశ స్వాతంత్ర్యం అనంతరం యువత సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. 1959 మే 3న ఆవిర్భవించిన ఏఐవైఎఫ్ కు దేశవ్యాప్తంగా యువత సమస్యలపై పోరాడిన చరిత్ర ఉందని పేర్కొన్నారు. యాదగిరిగుట్టలో




జరిగే రాష్ట్ర మహాసభలకు ప్రజలు, వ్యాపారవేత్తలు సహకరించి విరాళాలు అందించాలని ఆయన కోరారు. మహాసభలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఆలేరు మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, టౌన్ సహాయ కార్యదర్శి బొడ్డు ఆంజనేయులు, మండల కార్యవర్గ సభ్యుడు కందుల మధు, ఎన్ ఎఫ్ డబ్ల్యూ ఐ జిల్లా సహాయ కార్యదర్శి మాధురి జానమ్మ, ఏ ఐ టి యు సి ఆలేరు మండల కో-కన్వీనర్ గిరబోయిన స్వామి, మండల కార్యదర్శి జంగ సరళ, దార ఒదయ, చింతల నీలమ్మ, పిట్టల శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తల చెమటే.. కాంగ్రెస్ విజయానికి పునాది

- **2029లో రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యం**
- **గ్రామస్థాయి నుంచి ఢిల్లీ వరకు.. కాంగ్రెస్ జెండా ఎగరేద్దాం**
- **కార్యకర్త లు సైనికుల్లా పనిచేయాలి.. స్టే షన్ ఘనపూర్ ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతాం... ఎంపీ కడియం కావ్య**



**జఫర్‌గఢ్, సెప్టెంబర్ 1 (సమయం న్యూస్) :** కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఐక్యతే పార్టీకి అసలైన బలమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసి, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తిరుగులేని విజయాన్ని అందించే దిశగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2029లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడంతో పాటు తెలంగాణలో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం జఫర్‌గఢ్ మండల కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం, నూతన గ్రామ కమిటీల పరిచయ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గ్రామ కమిటీ సభ్యులను అభినందించారు. పదేళ్ల అణచివేత పాలనకు చరమగీతం పాడి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవడంలో కాంగ్రెస్ కార్యకర్తల పదేళ్ల కష్టానికి, పట్టుదలకు, శ్రమకు కీలక పాత్ర ఉందని కావ్య అన్నారు. వారి పోరాటం, త్యాగాల ఫలితంగానే రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిందన్నారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమంతో పాటు రాష్ట్రాన్ని ప్రపంచస్థాయి మౌలిక వసతుల దిశగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించే బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ప్రభుత్వం రైతులు, మహిళలు, విద్యార్థులు, యువతకు అందించిన ప్రయోజనాలను గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. గ్రామ కమిటీలు కాంగ్రెస్ పార్టీకి పునాదుల వంటివని, ప్రతి కార్యకర్త ప్రజలతో నిత్యం మమేకమై పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని కావ్య అన్నారు. చిన్నచిన్న విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా పనిచేయాలని సూచించారు. కార్యకర్తలకు ఏవైనా సమస్యలు ఉంటే పార్టీ నాయకత్వం, ఎమ్మెల్యే కడియం శ్రీహరి లేదా తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి నాయకత్వంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు తీసుకువచ్చామని ఎంపీ తెలిపారు. సుమారు రూ.1,400 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. గతంలో రెండు దశాబ్దాలుగా వెనుకబడిన నియోజకవర్గాన్ని వేగంగా అభివృద్ధి పథంలోకి తీసుకువస్తున్నామని అన్నారు. కొత్త, పాత నాయకులు, కార్యకర్తల సమన్వయంతో స్టేషన్ ఘనపూర్‌లో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడిందని కావ్య అన్నారు. గ్రూపు రాజకీయాలకు తావులేకుండా ఎమ్మెల్యే కడియం శ్రీహరి అందరినీ కలుపుకొని ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మహిళలు, బడుగు బలహీన వర్గాలను రాజకీయంగా, సామాజికంగా ముందుకు తీసుకెళ్లే పార్టీ అని అన్నారు. తాను ఎంపీగా, కడియం శ్రీహరి ఎమ్మెల్యేగా ఉండటం ఇందుకు నిదర్శనమన్నారు. పార్టీ కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచాలని, గ్రామ కమిటీల్లో మహిళలకు పెద్దఎత్తున అవకాశం కల్పించి నాయకత్వ లక్షణాలను పెంపొందించాలన్నారు.

**రాహుల్ నాయకత్వంలో రాజ్యాంగ పరిరక్షణ...**

కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ విలువలను విశ్వసిస్తుందని, రాహుల్ గాంధీ నాయకత్వంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చూపిన రాజ్యాంగబద్ధ మార్గంలో ముందుకు సాగుతోందని కడియం కావ్య అన్నారు. దేశ భవిష్యత్తు, యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. 2029లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడంతో పాటు తెలంగాణలో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు ఐక్యంగా, క్రమశిక్షణతో సైనికుల్లా పనిచేస్తే కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. రానున్న ఎన్నికల్లో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి అత్యధిక మెజారిటీ సాధించేలా ఇప్పటి నుంచే

# తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలి

**కలెక్టర్ హైమావతి**



**సిద్దిపేట, సెప్టెంబర్ 1( సమయం న్యూస్)** తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని టీటీడీసీ భవన్‌లో మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో విద్యాశాఖ పనితీరుపై ఆమె సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 89,462 మంది విద్యార్థుల ప్రవేశాలు లక్ష్యంగా పెట్టుకోగా 82,489 మంది మాత్రమే చేరారని, మిగిలిన లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉపాధ్యాయులపై తల్లిదండ్రులకు నమ్మకం పెరిగితే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరుగుతాయని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం మెరుగుపరచడంతో పాటు విద్యార్థుల ఆధార్ నమోదు ప్రక్రియను శనివారంలోగా పూర్తి చేయాలని సూచించారు. విద్యతో పాటు నైతిక విలువలను కూడా పిల్లలకు నేర్పాలని చెప్పారు. సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు సెలవుల అనంతరం ఆలస్యంగా తిరిగి వస్తున్న విషయాన్ని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్, సెక్టోరల్ అధికారి రామస్వామి, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ పై కేసులు ఎత్తి వేయాలి

## రాజ్యాంగ విలువలను కాపాడేందుకు మాట్లా డితే కేసులా? మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ



**ఆలేరు, సెప్టెంబరు 1(సమయం న్యూస్):** ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై ఉత్తరాఖండ్‌లో నమోదు చేసిన కేసును వెంటనే ఎత్తివేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీపై కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం భువనగిరి వినాయక చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జిల్లా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం పద్మ మాట్లాడుతూ కుల ఆధారిత వివక్ష, దళితులపై జరుగుతున్న అఘాయిత్యాలకు వ్యతిరేకంగా మాట్లాడే వారిని అణచివేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాజ్యాంగ విలువలను తీవ్రంగా అవమానించిన ఘటనలపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు, వాటిని ప్రశ్నించిన రాహుల్‌గాంధీపై కేసు నమోదు చేయడం విచారకరమన్నారు. హల్ద్వానీ ర్యాలీ వేదిక వద్ద బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు నిర్వహించిన కుల వివక్షకు సంబంధించిన ఘటనపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేసిందన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారని తెలిపారు. అలాంటి ఘటనను ప్రశ్నించినందుకు ఆయనపైనే కేసు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు.

**దళితుల హక్కుల కోసం గొంతెత్తు తాం**

కులవివక్ష, దళితులపై జరుగుతున్న అఘాయిత్యాలకు వ్యతిరేకంగా మాట్లాడటం ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి హక్కు అని నీలం పద్మ అన్నారు. ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని చెప్పారు. ఉత్తరాఖండ్‌లో జరిగిన ఘటనపై బాధ్యులైన బీజేపీ కార్యకర్తలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, రాహుల్‌గాంధీపై నమోదు చేసిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని మహిళా కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి వాణి, రాష్ట్ర కార్యదర్శి పావని కవిత, బ్లాక్ అధ్యక్షురాళ్లు సుధారాణి, సరూప రాణి, మండల అధ్యక్షురాలు సంగీత, రజిత, కె.లత, మమత, దీప, ఝాన్సీ, రేణుక, భువనగిరి పట్టణ అధ్యక్షురాలు కవిత, పీసీసీ డెలిగేట్ తంగళ్ల పల్లి రవి, సేవాదళ్ నాయకుడు పిట్టల బాలరాజు, రవి, కాలే నరసింహ తదితరులు పాల్గొన్నారు. మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ఏఐకేఎంఎస్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి


## రైతు, కూలీల సమస్యలపై భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తాం: మామిడాల సోమయ్య



**ఆలేరు, సెప్టెంబరు 1సమయం న్యూస్):** అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) తెలంగాణ రాష్ట్ర 9వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మామిడాల సోమయ్య కోరారు. సెప్టెంబరు 8, 9 తేదీల్లో మంచిర్యాల జిల్లా కేంద్రంలో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం ఆలేరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాసభలకు రాష్ట్రవ్యాప్తంగా రైతులు, కూలీల ప్రతినిధులు హాజరుకానున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై మహాసభల్లో విస్తృతంగా చర్చిస్తామని తెలిపారు. ఇప్పటివరకు ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతాంగ ఉద్యమాలను సమీక్షించి, భవిష్యత్‌లో చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ఐక్య రైతాంగ ఉద్యమాలను మరింత బలోపేతం చేయడం, రైతులు, కూలీల సమస్యలపై పోరాటాలను ఉధృతం చేయడంపై మహాసభల్లో నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, వ్యవసాయ వ్యతిరేక విధానాలు, పెద్ద కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా తీసుకుంటున్న నిర్ణయాలపై చర్చించి తగిన కార్యాచరణ రూపొందిస్తామని సోమయ్య తెలిపారు. రైతాంగ ప్రయోజనాల పరిరక్షణ కోసం ప్రజాస్వామిక శక్తులు, రైతులు, కూలీలు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మంచిర్యాలలో జరిగే రాష్ట్ర మహాసభలను జిల్లా రైతులు, కూలీలు, ప్రజాస్వామికవాదులు, అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాల కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మామిడాల బాలమల్లేష్, కొలనుపాక మాజీ ఎంపీటీసీ నమిలె ఐలయ్య, ఏఐకేఎంఎస్, ప్రజా సంఘాల నాయకులు తలారి వెంకటేష్, మామిడాల ప్రవీణ్, కోలా సోమయ్య, మామిడాల మహేష్, మామిడాల మధు తదితరులు పాల్గొన్నారు.

# సొంత డబ్బులతో రోడ్డుకు మరమ్మత్తు లు నిర్వహించిన సర్పంచ్ బిక్షపతి రెడ్డి

**శంషాబాద్ సమయం సెప్టెంబర్ 1;** శంషాబాద్ మండలంలోని రాయన్నగూడ కేపీ దొడ్డి గ్రామాల మధ్య దాదాపు రెండు కిలోమీటర్ల దూరం రోడ్డు పూర్తిగా గుంతలుగా మారడంతో ప్రయాణికులు రాకపోకలు నిర్వహించడానికి తీవ్ర ఇబ్బందులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు గత ఐదేళ్ల నుండి రోడ్డుపై ఏర్పడిన గుంతలను ఎవరూ పట్టించుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రయాణికులు రాకపోకలు నిర్వహిస్తున్నారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలను చూసి స్పందించిన మల్కారం గ్రామ సర్పంచ్ కొత్త బిక్షపతి రెడ్డి తన సొంత నిధులతో గుంతలను మొరం వేసి పూడ్చివేశారు. దీంతో రాకపోకలు సాఫీగా అవకాశం ఉందని స్థానికులు వర్షం వ్యక్తం చేస్తున్నారు.



# జీవనమే సందేశం.. బోయినపల్లి ప్రస్థానం

### నిలువెత్తు గాంధేయ జీవనం... బోయినపల్లి స్మరణం

### నేడు బోయినపల్లి వెంకట రామారావు జయంతి

సమాజ హితమే ఊపిరిగా.. ప్రజాసేవే పరమావధిగా.. సత్యం, అహింస, సమానత్వం, సామాజిక సంస్కరణలను జీవితాంతం ఆచరించిన మహోన్నత చైతన్యమూర్తి బోయినపల్లి వెంకట రామారావు. 'తోటపల్లి గాంధీ', 'కరీంనగర్ గాంధీ', 'తెలంగాణ గాంధీ'గా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన ఆయన జీవితం ఓ వ్యక్తి చరిత్ర మాత్రమే కాదు.. తెలంగాణ సామాజిక, సాంస్కృతిక, ఉద్యమ ప్రస్థానానికి నిలువెత్తు సాక్ష్యం. 1920 సెప్టెంబర్ 2న ఉమ్మడి కరీంనగర్ జిల్లా తోటపల్లి గ్రామంలో రంగమ్మ, కొండల్‌రావు దంపతులకు జన్మించిన వెంకట రామారావు.. 2014 అక్టోబర్ 27న 94వ ఏట కన్నుమూసే వరకు ప్రజాసేవే జీవితంగా గడిపారు. హైదరాబాద్ సంస్థాన విమోచన పోరాటం నుంచి గ్రంథాలయోద్యమం వరకు.. అస్పృశ్యతా నివారణ నుంచి భూదానోద్యమం వరకు.. ఖాదీ వికాసం నుంచి సాహిత్య, సాంస్కృతిక పునరుజ్జీవనం వరకు ఆయన అడుగుపెట్టని ప్రజాహిత రంగం లేదంటే అతిశయోక్తి కాదు. బాల్యంలోనే నిజాం పాలనలోని వెట్టిచాకిరీ, కుల వివక్ష, మూఢాచారాలు, మాతృభాషపై ఆంక్షలు వెంకట రామారావును కలచివేశాయి. ఆర్యసమాజ సంస్కరణ భావజాలం, స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి ఆయన ఆలోచనలకు పదును పెట్టాయి. పదహారేళ్ల ప్రాయంలోనే ప్రజాసేవకు అంకితమయ్యారు. 1935 డిసెంబర్ 29 నుంచి 1936 జనవరి 1 వరకు సిరిసిల్లలో జరిగిన నాలుగో ఆంధ్ర మహాసభలో స్వచ్ఛంద దళ నాయకుడిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆంధ్ర మహాసభను కేవలం సమావేశ వేదికగా కాకుండా ప్రజల్లో భాషా చైతన్యం, స్వేచ్ఛాకాంక్షను రగిలించే ఉద్యమ వేదికగా భావించారు. మూఢనమ్మకాలు, కుల జాడ్యాలు సమాజాన్ని పట్టిపీడిస్తున్న కాలంలోనే వెంకట రామారావు సంస్కరణల బాట పట్టారు. 1940లో చిల్వాకోడూరు కేంద్రంగా మొదలుపెట్టి జగిత్యాల, కోరుట్ల ప్రాంతాల్లో వితంతు పునర్వివాహాలకు ముందుండి సహకరించారు. ఛాందసవాదుల నుంచి బెదిరింపులు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. 1945 నాటికే దళితుల ఆలయ ప్రవేశానికి కృషి చేయడంతో పాటు వారితో సహపంక్తి భోజనాలు నిర్వహించారు. అట్టడుగు వర్గాలకు ఆత్మగౌరవం, విద్యావకాశాలు కల్పించినప్పుడే స్వాతంత్ర్యానికి సార్థకత చేకూరుతుందని తన ఆచరణతో చాటిచెప్పారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమ పిలుపుతో వెంకట రామారావు స్వాతంత్ర్య పోరాటంలో మరింత క్రియాశీలమయ్యారు. నిజాం పోలీసుల నిఘా, కుటుంబంపై ఒత్తిళ్లు ఆయన సంకల్పాన్ని సడలించలేకపోయాయి. తండ్రి కొండల్‌రావును మాలీ పటేల్ పదవి నుంచి తొలగించి నిర్బంధించినా ఆయన వెరవలేదు. అజ్ఞాతంలో ఉంటూనే మెట్‌పల్లి ఖాదీ కేంద్రంపై నిజాం ఆంక్షలను ధిక్కరించి మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. జమ్మికుంట రైల్వే మార్గానికి సంబంధించిన ఉద్యమ కేసులో అరెస్టై దాదాపు రెండేళ్లు కారాగార శిక్ష అనుభవించారు. 1945లో కాజీపేట సమీపంలో మహాత్మా గాంధీని ప్రత్యక్షంగా దర్శించడం వెంకట రామారావు జీవితంలో కీలక ఘట్టం. గాంధీజీతో సంభాషణ అనంతరం ఆయన జీవన విధానం మరింత గాంధేయ మార్గంలోకి మళ్లింది. ఖాదీ ధారణ, నిరాడంబర జీవనం, మద్యపాన నిషేధం, అహింసాయుత పోరాటాన్ని జీవితాంతం పాటించారు. 1948 జనవరి 30న గాంధీజీ హత్య వార్త తెలిసినప్పుడు జైలులోనే సంతాప సభ నిర్వహించి బాపూజీకి నివాళులర్పించారు. గాంధీని కేవలం అభిమానించడమే కాదు.. ఆయన ఆశయాలను తన జీవితంలో ఆచరించి చూపారు. వెంకట రామారావు జీవితంలో గ్రంథాలయోద్యమానికి ప్రత్యేక స్థానం ఉంది. 'గ్రంథాలయం పుస్తకాల కొట్టు కాదు.. ప్రజా చైతన్య వికాసానికి ప్రయోగశాల' అని బలంగా విశ్వసించారు. 1939లో తన 19వ ఏటనే 'ఆంధ్ర విద్యాభివర్ధిని' గ్రంథాలయాన్ని స్థాపించారు. 1972 నుంచి 1978 వరకు కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా సేవలందించారు. సుదీర్ఘకాలం పాలకమండలిలో కొనసాగుతూ ఊరూరా గ్రంథాలయాలు, సంచార పుస్తక కేంద్రాలు, వయోజన రాత్రి బడుల ఏర్పాటుకు కృషి చేశారు. 1976లో స్వయంగా స్థలం సమకూర్చి కరీంనగర్ జిల్లా కేంద్ర గ్రంథాలయానికి పక్కా భవనం నిర్మించేందుకు చొరవ చూపారు. అయ్యంకి వెంకట రమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, కోదాటి నారాయణరావు వంటి ప్రముఖులతో కలిసి పఠనోద్యమానికి ఊపిరిపోశారు. 1962లో 'కరీంనగర్ జిల్లా రచయితల సంఘం' స్థాపనలో కీలకపాత్ర పోషించిన వెంకట రామారావు.. అనంతరం 'సారస్వత జ్యోతి' సంస్థను ఏర్పాటు చేశారు. విశ్వనాథ సత్యనారాయణ, దివాకర్ల వేంకటావధాని, వానమామలై వరదాచార్యులు, పల్లా దుర్గయ్య, దాశరథి కృష్ణమాచార్య, సి.నారాయణరెడ్డి, గుంటూరు శేషేంద్రశర్మ, కాళోజీ నారాయణరావు, పీవీ నరసింహారావు వంటి ప్రముఖులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి సాహితీ కార్యక్రమాలు నిర్వహించారు. చరిత్ర పరిశోధకులు బీఎన్ శాస్త్రి, దూపాటి వేంకట రమణాచార్యులతో కలిసి శాతవాహనులు, కాకతీయుల కాలానికి చెందిన శాసనాలు, తాళపత్రాలు, పురాతన నాణేలు, ఇతర చారిత్రక ఆనవాళ్ల సేకరణకు కృషి చేశారు. స్వయంగా కవి అయిన ఆయన 'వెంకట రామారావు గేయాలు' వంటి రచనల ద్వారా ప్రజా చైతన్యాన్ని అక్షరబద్ధం చేశారు. సర్వోదయ ఆదర్శాలను జీవన విధానంగా మార్చుకున్న వెంకట రామారావు.. ఆచార్య వినోబా భావే, లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్‌లతో కలిసి పర్యటించారు. భూదానోద్యమంలో తనకున్న ఏడు ఎకరాల సారవంతమైన భూమిని నిరుపేదలకు దానం చేసి.. 'చెప్పడం కాదు.. చేసి చూపడమే త్యాగం' అని నిరూపించారు. 1981లో 'ఖాదీ నవనిర్మాణ సమితి'ని నెలకొల్పి గ్రామీణ చేతివృత్తుల పరిరక్షణకు కృషి చేశారు. అఖిల భారత సర్వసేవా సంఘం సభ్యుడిగా, ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండలి అధ్యక్షుడిగా, స్వాతంత్ర్య సమరయోధుల సంఘం ప్రతినిధిగా గాంధేయ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రచారం చేశారు. మద్యపాన నిషేధ ఉద్యమంలోనూ ఆయన ముందుండేవారు. వృద్ధాప్యంలోనూ తన సిద్ధాంతాల విషయంలో రాజీపడకుండా సత్యాగ్రహ దీక్షలకు దిగిన నిబద్ధత ఆయన సొంతం. ఆయన సేవలకు గుర్తింపుగా 'గ్రంథాలయ విభూషణ్', 'ఉపన్యాస కేసరి', 'హరిజన బంధు', 'విశ్వబంధు', 'అపర గాంధీ' వంటి బిరుదులు వరించాయి. 2005లో కాకతీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. 2014 అక్టోబర్ 27న బోయినపల్లి వెంకట రామారావు భౌతికంగా దూరమైనా.. ఆయన వెలిగించిన అక్షరజ్యోతి, గాంధేయ నిబద్ధత, త్యాగనిరతి నేటికీ వెలుగులు పంచుతూనే ఉన్నాయి. స్వాతంత్ర్యమంటే పరాయి పాలన నుంచి విముక్తి మాత్రమే కాదు.. అజ్ఞానం, అస్పృశ్యత, పేదరికం, అసమానతలు లేని సమాజ నిర్మాణమని తన జీవితంతో చాటిన బోయినపల్లి వెంకట రామారావు.. నిజంగానే 'జీవనమే సందేశం'గా నిలిచిన తెలంగాణ గాంధీ.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# కల్పవృక్షం కలకాలం జీవనాధారం

### నేడు ప్రపంచ కొబ్బరి దినోత్సవం



ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 2న ప్రపంచ కొబ్బరి దినోత్సవం నిర్వహిస్తారు. జీవన వృక్షం అని ప్రసిద్ధి చెందిన కొబ్బరి చెట్టు ప్రాధాన్యతను చాటడం, దాని ఆధారంగా జీవనోపాధి సాగిస్తున్న కోట్లాది మంది రైతుల కృషిని గుర్తించడం, పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడడం ఈ దినోత్సవం వెనుక ప్రధాన ఉద్దేశ్యం. ఆసియా పసిఫిక్ కొబ్బరి సమాజం అనే అంతర్జాతీయ సంస్థ 1999లో స్థాపించ బడింది. దీనిని పురస్కరించుకుని 2009లో మొదటి.సారిగా ప్రపంచ కొబ్బరి దినోత్సవం జరుపు కున్నారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది సెప్టెంబర్ 2న దీన్ని గుర్తుగా పాటిస్తున్నారు. ఈ సంస్థలో ఆసియా పసిఫిక్ ప్రాంతానికి చెందిన 18 దేశాలు సభ్యులుగా ఉన్నాయి. కొబ్బరి పంట ఉత్పత్తి, వినియోగం, అంతర్జాతీయ మార్కెట్ విస్తరణ, రైతుల ఆదాయాభివృద్ధి లక్ష్యాలతో ఈ వేదిక ఏర్పడింది.



కొబ్బరి చెట్టును కల్పవృక్షం అని పిలవడానికి కారణం దాని ప్రతి భాగం ఉపయోగకరమై ఉండడమే. వేర్లు, కాండం, ఆకులు, పండు అన్నీ మానవ జీవితానికి ఉపయోగ పడతాయి. కొబ్బరి నీరు సహజమైన ఎలక్ట్రోలైట్‌లకు నిలయం. 100 మిల్లీ లీటర్ల కొబ్బరి నీటిలో సుమారు 19 క్యాలరీలు, 4 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 250 మిల్లీ గ్రాముల పొటాషియం, 25 మిల్లీ గ్రాముల సోడియం ఉంటాయి. క్రీడాకారులకు, శ్రమతో జీవించే వారికి ఇది సహజ శక్తినిస్తుంది. కొబ్బరి నూనెలో 90 శాతం మధ్యస్థ శృంఖల కొవ్వు ఆమ్లాలు (వీజుం) ఉంటాయి. వీటిలో లౌరిక్ ఆమ్లం శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. కొబ్బరి పాలు విటమిన్ సి, ఇ, బి కంప్లెక్స్, ఇనుము, మగ్నీషియం, ఫాస్పరస్ వంటి ఖనిజాలతో నిండిపోయి ఉంటాయి. కొబ్బరి తురుము మిఠాయిలు, వంటకాల్లో రుచిని పెంచడమే కాకుండా అధిక ఫైబర్‌తో జీర్ణక్రియకు తోడ్పడుతుంది.

కొబ్బరి చెట్టు ఆకులను గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల పైకప్పుల కోసం, చాపలు, ముట్టెలు తయారీకి ఉపయోగిస్తారు. పీచు నుండి తాడులు, గోనె సంచులు, పరుపులు, బ్రష్‌లు తయారవుతాయి. తాటి కాండంతో గృహోపకరణాలు, ఫర్నిచర్ తయారు చేస్తారు. చిప్పలను బయోమాస్ ఇంధనంగా వినియోగిస్తారు. కొబ్బరి చెట్టు వాణిజ్య, పారిశ్రామిక, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా అమూల్యమైన వనరుగా నిలుస్తుంది.

ప్రపంచ వ్యాప్తంగా సంవత్సరానికి సుమారు 6.3 కోట్ల మెట్రిక్ టన్నుల కొబ్బరి ఉత్పత్తి అవుతుంది. ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, భారతదేశం మూడు ప్రధాన ఉత్పత్తి దారులు. వీటి లోనే ప్రపంచ ఉత్పత్తిలో 70 శాతం వస్తుంది. భారత దేశం రెండవ అతిపెద్ద ఉత్పత్తిదారు. 2023 గణాంకాల ప్రకారం దేశంలో 21 లక్షల హెక్టార్లకు పైగా కొబ్బరి సాగు విస్తరించి ఉంది. సంవత్సరానికి సుమారు 1.9 కోట్ల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరుగుతోంది. కేరళ ఒక్కదానిలోనే దేశీయ ఉత్పత్తిలో 40 శాతం వస్తుంది. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, గోవా కూడా ప్రధాన ఉత్పత్తి రాష్ట్రాలు. దేశ వ్యాప్తంగా సుమారు 20 కోట్ల ప్రజలు ప్రత్యక్ష, పరోక్షంగా కొబ్బరి ఆధారిత జీవనోపాధిపై ఆధారపడి ఉన్నారు.

కొబ్బరి ఉత్పత్తుల ద్వారా భారత దేశం ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని సంపాదిస్తోంది. కోయిర్ ఉత్పత్తులు, కొబ్బరి నూనె, ఎండు కొబ్బరి, కొబ్బరి నీటితో తయారైన పానీయాలు, హ్యాండ్‌క్రాఫ్ట్ ఎగుమతుల్లో ప్రధాన భాగం. కేవలం కోయిర్ ఉత్పత్తుల ద్వారానే 2022--23 ఆర్థిక సంవత్సరంలో సుమారు 4,340 కోట్ల రూపాయల ఎగుమతులు జరిగాయి. ఈ పరిశ్రమలో లక్షలాది మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు.

అయితే కొబ్బరి పరిశ్రమకు సవాళ్లు తక్కువ కావు. దేశ వ్యాప్తంగా పంటలో 30శాతం చెట్లు వయసు పైబడినవే. దిగుబడి తగ్గిపోవడం సహజం. కొత్తగా నాటే మొక్కలకు ప్రోత్సాహక పథకాలు అవసరం. కొబ్బరి చెట్లకు రూట్ విల్ట్, బ్లాక్ హెడ్, కీటకాల దాడి వంటి వ్యాధులు ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తాయి. మార్కెటింగ్ సౌకర్యాల లేమి, శ్రామికుల కొరత సమస్యలలో ముఖ్యమైనవి. ఒక చెట్టుపైకి ఎక్కి కాయలు కోయగల నైపుణ్యం కలిగిన శ్రామికులు రోజురోజుకూ తగ్గిపోతున్నారు. దీంతో రైతులు అధిక ఖర్చు పెట్టాల్సి వస్తోంది.

ప్రపంచ కొబ్బరి దినోత్సవం ఈ సమస్యలను గుర్తించడానికి, వాటి పరిష్కార మార్గాలను చర్చించడానికి ఒక మంచి వేదిక. ప్రతి సంవత్సరం ప్రత్యేకమైన థీమ్ ప్రకటించి రైతుల ఆదాయాభివృద్ధి, వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు పద్ధతులు, సాంకేతికత వినియోగం, మార్కెట్ విస్తరణ వంటి అంశాలపై దృష్టి సారిస్తారు. కొబ్బరి పరిశ్రమ భవిష్యత్తు స్థిరంగా ఉండాలంటే పంట సంరక్షణ, నూతన ఆవిష్కరణలు, పరిశోధనలతో పాటు రైతులకు ఆర్థిక రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది.

ప్రపంచ కొబ్బరి దినోత్సవం కేవలం ఒక వేడుక మాత్రమే కాదు. ఇది జీవనానికి, ఆర్థికాభివృద్ధికి, ఆరోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తుంది. కోట్లాది మంది రైతుల కష్టానికి గౌరవం ఇవ్వడం, ఈ వనరును భావి తరాలకు కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రకృతి మనకు ప్రసాదించిన ఈ కల్ప వృక్షాన్ని కాపాడుకోవడం ద్వారానే గ్రామీణాభివృద్ధి, స్థిరమైన జీవన విధానం సాధ్యమవుతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# జన హృదయ నేత వైఎస్

### నేడు రాజశేఖర్ రెడ్డి వర్ధంతి


తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన ప్రజా నాయకుడు, ఆంధ్రప్రదేశ్ 16వ ముఖ్యమంత్రి డాక్టర్ యెడుగూరి సందింటి రాజశేఖరరెడ్డి (వైఎస్సార్) వర్ధంతి సందర్భంగా నేడు (సెప్టెంబర్ 2) ఆయన సేవలను రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు స్మరించుకుంటున్నారు. 1949 జూలై 8న జమ్మలమడుగులోని సీఎస్ఐ కాంప్‌బెల్ మిషన్ ఆసుపత్రిలో జయమ్మ, రాజారెడ్డి దంపతులకు జన్మించిన వైఎస్సార్, బళ్ళారిలోని సెయింట్ జాన్స్ పాఠశాలలో ప్రాథమిక విద్యను, విజయవాడ లయోలా కళాశాలలో ఉన్నత విద్యను పూర్తి చేశారు. గుల్బర్గా విశ్వవిద్యాలయం నుంచి ఎంబీబీఎస్ పట్టా పొంది, తిరుపతిలోని ఎస్వీఆర్ఆర్ కళాశాలలో హౌస్ సర్జన్ చేశారు. గుల్బర్గా ఎంఆర్ఎం వైద్య కళాశాలతో పాటు ఎస్వీఆర్ఆర్‌లోనూ విద్యార్థి/హౌస్ సర్జన్ సంఘాల అధ్యక్షుడిగా ఎన్నికై విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు చాటారు. ఆ తర్వాత జమ్మలమడుగు సీఎస్ఐ ఆసుపత్రిలో వైద్యాధికారిగా,



పులివెందులలో తన తండ్రి పేరిట నిర్మించిన 70 పడకల ఆసుపత్రిలో డాక్టర్‌గా సేవలు అందించారు. వీరి కుటుంబం పులివెందులలో నెలకొల్పిన కళాశాలలను లయోలా సంస్థలకు అప్పగించగా, సింహాద్రిపురంలోని కళాశాలను ఇప్పటికీ వారి కుటుంబమే నిర్వహిస్తోంది.

1978లో పులివెందుల నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన వైఎస్సార్, అక్కడ నుంచి 6 సార్లు శాసనసభ్యుడిగా మరియు కడప లోక్‌సభ నియోజకవర్గం నుంచి 4 సార్లు ఎంపీగా విజయం సాధించి తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఓటమనేదే ఎరుగని నేతగా నిలిచారు. 1980-83 కాలంలోనే గ్రామీణాభివృద్ధి, వైద్యం, విద్యా, ఎక్సైజ్ శాఖల మంత్రిగా పనిచేశారు. 1983-85 మరియు 1998-2000 మధ్య రెండు పర్యాయాలు ఏపీసీసీ అధ్యక్షుడిగా సేవలు అందించారు. కాంగ్రెస్ పార్టీలో మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి, కోట్ల విజయభాస్కర్ రెడ్డి వంటి సీనియర్లతో విభేదిస్తూ నిత్య అసమ్మతివాదిగా పేరుపొందిన ఆయన, సొంత పార్టీ నేతలపై రాజకీయ పోరాటాలు సాగించారు. నాడు నగరంలో జరిగిన అల్లర్లలో వైఎస్సార్ వర్గం పాత్ర ఉందనే ఆరోపణలు వచ్చినప్పటికీ, తదనంతర కాలంలో తాను ముఖ్యమంత్రి అయ్యేనాటికి పార్టీలో ఎలాంటి శిబిరాలు లేకుండా సర్వహక్కులు సాధించుకోగలిగారు. 1999 నుంచి 2004 వరకు ప్రతిపక్ష నేతగా వ్యవహరించిన ఆయన, 2003 వేసవిలో చేపట్టిన 1,467 కిలోమీటర్ల చారిత్రాత్మక పాదయాత్ర ద్వారా ప్రజల్లో అపారమైన జనాదరణ పొంది మునిగిపోతున్న కాంగ్రెస్ నావను ఒడ్డుకు చేర్చారు.

2004 మేలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి తొలిసారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించిన వైఎస్సార్, తన పాదయాత్ర హామీ మేరకు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఫైలుపైనే తొలి సంతకం చేశారు. జలయజ్ఞం కింద పెండింగ్ నీటిపారుదల ప్రాజెక్టులను వేగవంతం చేయడంతో పాటు పలు సంక్షేమ పథకాలను అమలు చేశారు. క్రైస్తవ విశ్వాసాలు పాటిస్తూనే బెత్లహేమ్ యాత్రలు చేసిన ఆయన, పరంపరగా వస్తున్న హిందూ సంప్రదాయాలను వీడకుండా తిరుమల శ్రీవెంకటేశ్వర



స్వామిని అనేకమార్లు దర్శించుకునేవారు. 2009 ఎన్నికల్లో శాసనసభలో 156 స్థానాలు, లోక్‌సభలో 33 స్థానాలు సాధించి కాంగ్రెస్‌ను ఒంటిచేత్తో గెలిపించి వరుసగా రెండోసారి సీఎం అయ్యారు. అయితే, 2009 సెప్టెంబర్ 2న చిత్తూరు జిల్లా పర్యటనకు వెళ్తుండగా ఉదయం 9:35 గంటలకు హెలికాప్టర్‌తో సంబంధాలు తెగిపోగా, నల్లమల అడవుల్లో సంభవించిన ప్రమాదంలో ఆయనతో పాటు ఐదుగురు మరణించారు. ఆయన మరణవార్తను తట్టుకోలేక రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 67 మంది గుండె ఆగి మరియు ఆత్మహత్యల వల్ల ప్రాణాలు కోల్పోవడం ఆయన పట్ల ప్రజలకున్న అభిమానానికి నిదర్శనం. భౌతికంగా దూరమైనా ఆయన అందించిన పాలన, సంక్షేమ పథకాలు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494